# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 4 | మంగళవారం | 18.08.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 4 | Tuesday | 18.08.2026 | Pages: 8 | Rate: 2





# కేసీఆర్-కేటీఆర్‌పై సీఎం సెటైర్లు

- అబద్ధాలు ఆపకపోతే నిజాలు చెబుతా
- 2034 వరకు మారొద్దంటున్న హితవు



సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్, కేటీఆర్‌పై మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కేసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా. వాళ్లు అబద్ధాలు చెప్పడం మాననంత కాలం నేను ఇలాగే నిజాలు చెబుతూనే ఉంటా" అంటూ సెటైర్లు వేశారు. టిమ్స్ నిర్మాణంపై కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఆసుపత్రిని ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. తమ కుటుంబం అధికారంలో ఉన్న సమయంలో ఫామ్‌హౌస్‌లు నిర్మించుకోవడానికి సమయం దొరికింది కానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తి చేయడానికి సమయం దొరకలేదా? అంటూ నిలదీశారు.



## పోచారం ఏం చేస్తున్నారు?

**• నిన్న కేసీఆర్‌పై పొగడ్తలు • నేడు రేవంత్‌తో షేక్‌హ్యాండ్!**

పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాజకీయ అడుగులు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. నిన్న కేసీఆర్‌పై ప్రశంసలు.. ఇవాళ సీఎం రేవంత్‌రెడ్డితో ఆత్మీయ పలకరింపు! అసలు పోచారం లెక్కేంటి? అన్న చర్చ జోరందుకుంది. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కేసీఆర్ నాయకత్వాన్ని బలంగా సమర్థించిన పోచారం.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కీలక పరిణామాల మధ్య ప్రభుత్వ సలహాదారుగా మారారు. తాజాగా కామారెడ్డి జిల్లా బిచ్కుందలో జరిగిన ఓ వివాహ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. అక్కడ హెలిప్యాడ్ వద్ద పోచారం శ్రీనివాస్‌రెడ్డి సీఎంను కలిసి శాలువాతో సత్కరించారు. అంతటితో ఆగలేదు.. రేవంత్ తిరిగి వెళ్లే సమయంలో ప్రత్యేక బస్సులో ఆయనతో కలిసి హెలిప్యాడ్ వరకు వెళ్లడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చకు కారణమైంది. ఇటీవల ప్రభుత్వంపై విమర్శలు చేసిన పోచారం.. అదే ప్రభుత్వ ముఖ్యమంత్రితో ఇలా సన్నిహితంగా కనిపించడం వెనుక రాజకీయ వ్యూహం ఏంటి? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దేనికి దానికేనా? నిన్న ఒక మాట..నేడు మరో అడుగు? లేక బాన్సువాడ రాజకీయాల్లో ఇదంతా కొత్త సమీకరణాలకు సంకేతమా? పోచారం ఏం చేస్తున్నారు? అన్నదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర ప్రశ్నగా మారింది.




## వనపర్తిలో ఆధిపత్య పోరు..

### "చిన్న" బుచ్చుకున్న "రెడ్డి" సారు

**ఉనికి కోసం "జీవన్" మరణ పోరాటం • నియోజకవర్గ పట్టు కోసం ఆరాటం**

### మేఘారెడ్డి వర్సెస్ చిన్నారెడ్డి వార్

వనపర్తి కాంగ్రెస్‌లో మాటల మంటలు.. రాజకీయ ప్రకంపనలు! నిన్నటివరకు పార్టీ కోసం కలిసి నడిచిన నేతలే ఇప్పుడు ఒకరిపై ఒకరు కత్తులు దూసే పరిస్థితి. సీనియర్ నేత చిన్నారెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలతో వనపర్తి రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఎమ్మెల్యే మేఘారెడ్డిపై టికెట్ నుంచి అభివృద్ధి పనుల వరకు సంచలన ఆరోపణలు రాజకీయ వర్గాల్లో దుమారం రేపుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే తాను కూడా జీవన్‌రెడ్డిలా తిరగబడతానన్న చిన్నారెడ్డి హెచ్చరిక కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది. పార్టీని వీడనంటూనే.. పార్టీలోనే ఉంటూ కొందరిని బయటకు పంపిస్తానన్న వ్యాఖ్యలు మరింత సంచలనంగా మారాయి. ఐతే చిన్నారెడ్డి వ్యాఖ్యలకు మెగా రెడ్డి అంతే ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. మాటలు కాదు రుజువులు చూపించాలంటూ వార్నింగ్ ఇచ్చారు. చిన్నపామునైనా పెద్ద కర్రతో కొడతానంటూ హైకమాండ్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.




# తెలంగాణకు ఢిల్లీ షాక్..

## బీజేపీ వ్యూహం మారిందా?

**• పొరుగు రాష్ట్రాల నుంచి సెలెక్ట్ • తెలంగాణ లీడర్స్ పేర్లు రిజెక్ట్**
**• జాతీయ పదవుల్లో ఎంప్టీ హ్యాండ్ • రాష్ట్ర వర్గానికి షాకిచ్చిన హైకమాండ్**

జాతీయ టీమ్‌లో తెలంగాణకు చోటు లేదు. రాష్ట్రంలో బీజేపీ బలం పెరుగుతోందని చెబుతున్న వేళ.. ఢిల్లీలో తీసుకున్న నిర్ణయం ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో వేడి పుట్టిస్తోంది. ఎంపీలు ఉన్నారు.. ఎమ్మెల్యేలు ఉన్నారు.. సీనియర్ నేతలు ఉన్నారు.. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నామని పార్టీ చెబుతోంది. అయినా కొత్త జాతీయ టీమ్‌లో తెలంగాణ నేతకు కీలక పదవి ఎందుకు దక్కలేదు? ఇదే ఇప్పుడు అసలు ప్రశ్న. ఒకవైపు ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాలకు జాతీయ స్థాయిలో కీలక పదవులు దక్కాయి. మరోవైపు తెలంగాణ మాత్రం జాతీయ కూర్పులో ఖాళీగా కనిపించింది. ఇది సాధారణ సంస్థాగత నిర్ణయమేనా? లేక తెలంగాణపై బీజేపీ హైకమాండ్ వ్యూహంలో ఏదైనా మార్పు వచ్చిందా? రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయాలనుకుంటున్నామని నితిన్ నబీన్ ప్రకటించిన కొద్దికాలానికే వచ్చిన ఈ కూర్పు కొత్త అనుమానాలకు తావిస్తోంది. తెలంగాణకు పదవి దక్కకపోవడం కంటే.. ఎందుకు దక్కలేదన్నదే ఇప్పుడు హాట్ టాపిక్. 2028 అసెంబ్లీ ఎన్నికలను టార్గెట్ చేసిన బీజేపీ.. రాష్ట్ర నేతలను ఢిల్లీకి దూరంగా ఉంచి తెలంగాణలోనే పూర్తి బాధ్యతలు అప్పగించబోతోందా? లేక ఇది తెలంగాణ రాజకీయాలపై మారుతున్న హైకమాండ్ లెక్కలకు సంకేతమా? బీజేపీ–బీఆర్ఎస్ భవిష్యత్ సమీకరణాలపై ఇప్పటికే చర్చ నడుస్తున్న వేళ.. కొత్త జాతీయ టీమ్ కూర్పు ఆ చర్చకు మరింత మంట రాజేసింది. ఢిల్లీలో తీసుకున్న ఈ నిర్ణయం.. తెలంగాణలో ఎలాంటి రాజకీయ ప్రకంపనలు సృష్టించబోతోంది?

## సర్కార్ నడుపుతున్నారా..? సర్కస్ నడుపుతున్నారా?

**రేవంత్ సర్కార్‌పై హరీశ్ ఫైర్**

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై వివాదం నేపథ్యంలో బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. "సర్కార్ నడుపుతున్నారా..సర్కస్ నడుపుతున్నారా రేవంత్‌రెడ్డి?" అంటూ మాజీ మంత్రి బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు ఘాటు ప్రశ్నలు సంధించారు. పథకాల అమలులో తలెత్తిన న్యాయపరమైన సమస్యలకు అధికారులను బాధ్యులుగా చూపించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులు లేదా న్యాయపరమైన వ్యవహారాల్లో జరిగిన తప్పిదాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పడాన్ని బీఆర్ఎస్ తప్పుబట్టింది. తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష అధికారులు ఎందుకు అనుభవించాలి? అంటూ ప్రశ్నించింది. పేద కుటుంబాల జీవితాలతో ముడిపడిన సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేసింది.

(వివరాలు 2లో..)







## కల్యాణలక్ష్మిపై కయ్యం.. ఎవరి వాదన నిజం?

### పథకం కొనసాగింపుపై కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ వేడి పెరిగింది. పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేయాలని చూస్తోందంటూ బీఆర్ఎస్ ఆరోపిస్తుంటే.. పేదలకు అండగా నిలిచే ఈ పథకాలను కొనసాగించేందుకు తాము కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం చెబుతోంది. పథకాల విషయంలో కాంగ్రెస్ వైఖరిని ప్రజల్లో ఎండగట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కోర్టు మధ్యంతర ఆదేశాలను సాకుగా చూపుతూ పథకాలను నిలిపివేస్తున్నారని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. మరోవైపు మంత్రి పొన్నం ప్రభాకర్ మాత్రం పథకాన్ని రద్దు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని, న్యాయపరమైన సమస్యను పరిష్కరించి కొనసాగిస్తామని స్పష్టం చేశారు.




## 22ఏపై పొంగులేటి సారీ

**• భూముల సమస్యకు పరిష్కారం • మీరేం చేశారో మరచిపోయారా?**

### హరీశ్‌రావుకు మంత్రి సెటైర్లు

22ఏ నిషేధిత భూముల వ్యవహారంపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ప్రకటన చేశారు. నిజమైన ప్రైవేటు భూమి 22ఏ జాబితాలో ఉంటే.. ఒక చిన్న దరఖాస్తు ఇస్తే చాలు, న్యాయబద్ధంగా ఉంటే క్లియర్ చేయించే బాధ్యత ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాల వల్ల సామాన్యులకు ఇబ్బందులు తలెత్తిన మాట వాస్తవమేనని, దీనిపై ప్రజలను ఇబ్బంది పెట్టినందుకు ప్రభుత్వం తరఫున క్షమాపణలు చెబుతున్నామని పేర్కొన్నారు. 22ఏ సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటికే 757 మంది ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ నెలాఖరులోగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నిజమైన భూ హక్కుదారులకు న్యాయం చేయడంతో పాటు ప్రభుత్వ భూములను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

(వివరాలు 2లో..)




## బీజేపీ డిజిటల్ టీమ్‌లో భారీ మార్పులు

**మాలవీయ ఔట్.. మహాస్కేకు బాధ్యతలు**

## ఓటరు జాబితాలో పేరు ఉందా?

### చెక్ చేసుకోండి.. ఓటు మీ హక్కు

**కాపాడుకోండి.. డ్రాఫ్ట్ లిస్ట్ విడుదల**

తెలంగాణలో సర్2026 ప్రక్రియలో కీలక దశ పూర్తైంది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు జరిగిన ఎన్యూమరేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. ఈ దశలో ఓటర్ల నుంచి 2.65 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించినట్లు వెల్లడించారు. ఇది రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో 78.30 శాతంగా ఉంది. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, అందుబాటులో లేని వారు, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో నమోదైన ఓటర్ల వివరాలను కూడా అధికారులు పరిశీలించారు. (వివరాలు 2లో..)







## అనసూయకు బిగ్ షాక్..

**మాటలతో మొదలైన మంట**

**పోలీస్ స్టేషన్‌కు పంచాయితీ!**

అనసూయ పేరు చెబితేనే సోషల్ మీడియా అలర్ట్ అవుతుంది.. ఇప్పుడు బోరబండ పోలీస్ స్టేషన్ పేరు కూడా యాడ్ అయింది! ఓ వైపు యాంకరింగ్.. మరోవైపు యాక్టింగ్.. ఇంకోవైపు సోషల్ మీడియా కామెంట్స్.. ఇలా ఎక్కడ మైక్ కనిపించినా మసాలా కంటెంట్ రెడీ అన్నట్టుగా పరిస్థితి మారింది. తాజాగా 'జైశ్రీరామ్' నినాదం చుట్టూ ఆమె చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు ఫైర్ అయ్యారు. హిందూ మతంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.




## రామమందిర విరాళాల కేసు

**• సిట్ దర్యాప్తుపైనే నమ్మకం • సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు**


రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

## రాహుల్ ఆస్తుల కేసుపై దర్యాప్తు

**విచారణ సంస్థలపై సుప్రీం ఆగ్రహం**

**సీరియస్ అయితే ఇంతకాలం ఎందుకు?**




## భార్యను వదిలేసి ఇంకో పెళ్లా?

**ఐతే మీ జీతం కట్ అవుతుంది**

**ఉద్యోగులకు అస్సాం సీఎం ఫిటింగ్**

**ప్రభుత్వ ఉద్యోగులకు స్ట్రాంగ్ వార్నింగ్**

## 2029 టార్గెట్.. బీజేపీ టీమ్ రెడీ!




- ముగ్గురు మాజీ సీఎంలు, 18 మంది ఎంపీలు
- నితిన్ నబీ జంబో టీమ్

2029 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ తన జాతీయ కార్యవర్గాన్ని వ్యూహాత్మకంగా సిద్ధం చేసింది. మొత్తం 64 మంది జాతీయ పదాధికారులతో కొత్త టీమ్‌ను ఏర్పాటు చేసింది.




## 16 ఏళ్లకే వరల్డ్ రికార్డు

**చార్టర్డ్ అకౌంటెంట్ సంచలనం**

# కేసీఆర్-కేటీఆర్‌పై సీఎం సెటైర్లు

**• అబద్ధాలు ఆపకపోతే నిజాలు చెబుతా • 2034 వరకు మారొద్దంటున్న హితవు**

### పేదల వైద్యమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో టిమ్స్ ఆసుపత్రులను పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఆరోగ్యశ్రీ కోసం రూ.2,700 కోట్లు, సీఎంఆర్ఎఫ్ కోసం రూ.2,526 కోట్లు ఖర్చు చేశామని, మొత్తం రూ.5,226 కోట్లు పేదల ఆరోగ్యం కోసం వెచ్చించామని వెల్లడించారు. రెండేళ్లలో వైద్య ఆరోగ్య శాఖకు రూ.21,800 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. సనత్‌నగర్, ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తే 10 వేల పడకలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. 2027 డిసెంబర్ 9లోగా వాటిని పూర్తి చేస్తామని ప్రకటించారు.

### ఆసుపత్రులపై డెడ్‌లైన్.. విపక్షాలపై ఫైర్

ప్రతి ఆసుపత్రికి ప్రత్యేక డైరెక్టర్‌ను నియమించి పర్యవేక్షిస్తామని సీఎం తెలిపారు. కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రోగుల అటెండెంట్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తామని, అదనపు సమయం పనిచేసే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టిమ్స్‌ను తామే నిర్మించామని కేటీఆర్ చెప్పడంపై రేవంత్ తీవ్రంగా స్పందించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు రిబ్బన్ కట్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఇకనైనా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచిస్తూ, నియోజకవర్గానికి రూ.10-20 కోట్లు ఖర్చు చేసి ప్రజలకు సేవ చేస్తే గత తప్పుల ప్రభావం కొంత తగ్గుతుందని వ్యాఖ్యానించారు. అబద్ధపు ప్రచారాలతో ప్రజలను నమ్మించలేరని, పేదలకు వైద్యం అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ స్పష్టం చేశారు.










# 22ఏపై పొంగులేటి సారీ

- భూముల సమస్యకు పరిష్కారం
- మీరేం చేశారో మరచిపోయారా?
- హరీశ్‌రావుకు మంత్రి సెటైర్లు

**• రికార్డులు పరిశీలించి.. రిజిస్ట్రేషన్‌కు అవకాశం**

22ఏలో భూమి ఉందన్న కారణంతో దరఖాస్తుదారులను తిరస్కరించవద్దని పొంగులేటి అధికారులకు సూచించారు. భూమి నిషేధిత జాబితాలోకి ఎలా వచ్చిందో, సంబంధిత రికార్డులు ఏం చెబుతున్నాయో, వాస్తవ పరిస్థితి ఏమిటో పూర్తిగా పరిశీలించాలని ఆదేశించారు. జెన్యూన్ కేసులను వెంటనే పరిష్కరించి రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. అవసరమైతే స్లాట్ బుకింగ్‌లు పెంచడం, కార్యాలయాల పని వేళలు పెంచడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. రిజిస్ట్రేషన్ సాధ్యం కాని సందర్భాల్లో అందుకు కారణాన్ని ప్రజలకు స్పష్టంగా చెప్పాలని, ఫీజు చెల్లించిన వారికి నిబంధనల ప్రకారం తిరిగి చెల్లించాలని ఆదేశించారు. భూదాన్, దేవాదాయ, అటవీ భూముల పక్కన ఉండటం, ఒకే సర్వే నంబర్ కారణంగా కొన్ని ప్రైవేటు భూములు 22ఏలో చేరినట్లు గుర్తించామని, వాటిని పరిశీలించి క్లియర్ చేస్తామని చెప్పారు. సమస్యల కోసం 18005994788 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### హరీశ్‌రావుపై పొంగులేటి ఘాటు సెటైర్లు

22ఏ సమస్యపై మంత్రి చేసిన ప్రకటనకు బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు చేయగా పొంగులేటి ఘాటుగా స్పందించారు. "ప్రభుత్వ విధానాల వల్ల సమస్యలు వస్తే సమాధానం చెప్పకుండా బుకాయించడం మీకు తెలిసినట్లు మాకు తెలియదు" అంటూ సెటైర్ వేశారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ భూముల పరిరక్షణను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అప్పటి పాలనలో పేపర్ లీకులు జరిగినా, నిరుద్యోగులు తీవ్ర ఆందోళనకు గురైనా బాధ్యత తీసుకోలేదని విమర్శించారు. "మాది ప్రజా ప్రభుత్వం.. మీది దొరల ప్రభుత్వం" అంటూ హరీశ్‌రావును టార్గెట్ చేశారు. ప్రజల సమస్యను విని, పరిష్కార చర్యలను వివరించి, తప్పిదం జరిగితే క్షమాపణ చెప్పే ధైర్యం తమ ప్రభుత్వానికి ఉందన్నారు. చివరగా "ప్రభుత్వ భూములకు రక్షణ.. నిజమైన హక్కుదారులకు న్యాయం" అనే రెండు లక్ష్యాలతో 22ఏ సమస్యను పరిష్కరిస్తామని పొంగులేటి స్పష్టం చేశారు.

# సర్కార్ నడుపుతున్నారా.. ?

- సర్కస్ నడుపుతున్నారా?
- రేవంత్ సర్కార్‌పై హరీశ్ ఫైర్




### 22ఏ వ్యవహారంపైనా విమర్శలు

నిషేధిత భూముల జాబితా వ్యవహారంలో పొరపాట్లు వెలుగులోకి వచ్చిన సందర్భంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారుల తరపున క్షమాపణ చెప్పడంపైనా హరీశ్ రావు మండిపడ్డారు. "సారీ చెప్పి తప్పించుకుంటే సరిపోదు" అంటూ విమర్శలు చేశారు. 22ఏ భూముల వ్యవహారంతో అనేక మంది భూహక్కుదారులు మానసిక వేదనకు గురయ్యారన్నారు. ప్రజల జీవితాలతో ముడిపడిన అంశాల్లో ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల వ్యవహారాల్లో స్పష్టత ఉండాలన్నారు. అధికారులపై చర్యలు తీసుకునే ముందు ప్రభుత్వ నిర్లక్ష్యం, పాలనా వైఫల్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పిదాలకు ఎవరు బాధ్యులో తేల్చి, భూహక్కుదారులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు.

### పేదల పథకాలు ఆగొద్దు

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిలిచిపోతాయన్న ఆందోళన పేద కుటుంబాల్లో ఉందని బీఆర్ఎస్ పేర్కొంది. పేదింటి ఆడబిడ్డల వివాహానికి భరోసాగా నిలిచిన పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపకూడదని డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఎన్ని సార్లు క్షమాపణలు చెప్పినా ప్రజల సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రయోజనం ఉండదని విమర్శించింది. అదే సమయంలో 22ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అర్హులైన భూహక్కుదారుల భూములను రాష్ట్రవ్యాప్తంగా పరిశీలించి, నిషేధిత జాబితా నుంచి తొలగించి పూర్తి హక్కులు కల్పించాలని కోరింది. "ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు సీరియస్‌గా ఉన్నారు" అంటూ బీఆర్ఎస్ హెచ్చరికలు చేసింది. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# ఓటరు జాబితాలో పేరు ఉందా?

**చెక్ చేసుకోండి.. ఓటు మీ హక్కు**

**• కాపాడుకోండి.. డ్రాఫ్ట్ లిస్ట్ విడుదల**




తెలంగాణలో సర్2026 ప్రక్రియలో కీలక దశ పూర్తైంది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు జరిగిన ఎన్యూమరేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. ఈ దశలో ఓటర్ల నుంచి 2.65 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించినట్లు వెల్లడించారు. ఇది రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో 78.30 శాతంగా ఉంది. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, అందుబాటులో లేని వారు, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో నమోదైన ఓటర్ల వివరాలను కూడా అధికారులు పరిశీలించారు.

### పేరు ఉందో లేదో చూసుకోండి

ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైంది. సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. దీంతో ప్రతి ఓటరు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను జాబితాలో ఒకసారి పరిశీలించుకోవడం కీలకం. పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా నిర్ణీత గడువులో అభ్యంతరం లేదా సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చు. సర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి వివరాలు వివరించారు. ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వారి సూచనలను పరిశీలిస్తామని సీఈవో తెలిపారు.

### ఒక్క ఓటరూ మిస్ కాకూడదు

ముసాయిదా ఓటర్ల జాబితాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు హార్డ్‌డిస్క్‌ల ద్వారా అందజేశారు. జాబితా పరిశీలనతో పాటు క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రక్రియలో పార్టీలు చురుగ్గా పాల్గొనాలని సీఈవో కోరారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా చూడటమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన హక్కు కావడంతో ప్రతి పౌరుడు నిర్లక్ష్యం చేయకుండా జాబితాను పరిశీలించాలి. పేరు లేకపోతే లేదా వివరాల్లో పొరపాటు కనిపిస్తే గడువు ముగిసేలోపు సంబంధిత అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలి. సెప్టెంబర్ 16లోపు స్పందిస్తేనే మీ ఓటు హక్కు భద్రంగా ఉంటుంది.

# కళ్యాణలక్ష్మిపై కయ్యం.. ఎవరి వాదన నిజం?



కళ్యాణలక్ష్మి పథకానికి సంబంధించిన జీవోలపై హైకోర్టులో దాఖలైన పిటిషన్ నేపథ్యంలో ఆగస్టు 12న మధ్యంతర ఆదేశాలు వచ్చాయని ప్రభుత్వం చెబుతోంది. ఈ కేసులో డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని పొన్నం తెలిపారు. కౌంటర్ దాఖలు చేయడంలో అధికారుల తప్పిదమా, న్యాయపరమైన వ్యవహారాలు చూసిన వారి లోపమా అన్నది విచారిస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 2014లో జారీ చేసిన జీవోల్లో లోపాల వల్లే ప్రస్తుత సమస్య వచ్చిందని కాంగ్రెస్ వాదిస్తోంది. పథకం అమలుకు ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేస్తోందని చెబుతోంది. ఇప్పటివరకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా రూ.16,375.87 కోట్లకు పైగా ఖర్చు చేసి 16,78,347 మంది లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించినట్లు ప్రభుత్వం పేర్కొంటోంది.

### పేదల పథకమా.. రాజకీయ పంచాయితీనా?

బీఆర్ఎస్ మాత్రం ప్రభుత్వ వాదనలను అంగీకరించడం లేదు. పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక భరోసాగా నిలిచిన పథకాలను ఎలాంటి కారణంతోనూ నీరుగార్చొద్దని డిమాండ్ చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా పథకాలను కొనసాగించాలనుకుంటే కోర్టు సమస్యను వేగంగా పరిష్కరించి లబ్ధిదారులకు నిధులు అందించాలని బీఆర్ఎస్ అంటోంది. ప్రభుత్వం మాత్రం ఇది గత ప్రభుత్వం ప్రారంభించిన పథకమే అయినా రాజకీయాలకు అతీతంగా కొనసాగిస్తున్నామని స్పష్టం చేస్తోంది. గతంలో చెక్కుల కోసం లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని, తాము నిధుల విడుదల వ్యవస్థను మెరుగుపరిచామని పొన్నం చెబుతున్నారు. దీంతో కళ్యాణలక్ష్మి వ్యవహారం ఇప్పుడు పథకం భవిష్యత్తు కంటే కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ రాజకీయ పోరాటంగా మారింది. అసలు పథకం ఆగుతుందా? కొనసాగుతుందా? అన్నదానిపై కోర్టు తదుపరి నిర్ణయం కీలకంగా మారనుంది.

# వనపర్తిలో ఆధిపత్య పోరు..

## "చిన్న" బుచ్చుకున్న "రెడ్డి" సారు

- ఉనికి కోసం "జీవన్" మరణ పోరాటం
- నియోజకవర్గ పట్టు కోసం ఆరాటం
- మేఘారెడ్డి వర్సెస్ చిన్నారెడ్డి వార్





కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి చిన్నారెడ్డి వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ అంతర్గతంగా కొనసాగుతున్న అసంతృప్తి నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. మేఘారెడ్డి డబ్బులు ఇచ్చి ఎమ్మెల్యే టికెట్ కొనుక్కున్నారని చిన్నారెడ్డి ఆరోపించారు. తనకు సోనియా గాంధీ టికెట్ ఇచ్చి, డబ్బులు లేకపోతే స్వయంగా ఖర్చు పెట్టుకుని గెలిపించాలని రేవంత్ రెడ్డికి చెప్పారని పేర్కొన్నారు. అయితే డబ్బులకు ఆశపడి మేఘారెడ్డి వద్ద డబ్బులు తీసుకుని ఆయనకే టికెట్ ఇచ్చారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో మరోసారి నేతల మధ్య విభేదాలను తెరపైకి తెచ్చాయి.

### అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేపై ఆరోపణలు

వనపర్తి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఎందుకు నిలిచిపోయాయని మంత్రులను కలిసి ప్రశ్నించినప్పుడు.. మేఘారెడ్డి పనులకు అడ్డుపడుతున్నారని మంత్రులు చెప్పారని చిన్నారెడ్డి తెలిపారు. కాంట్రాక్టులు తన అనుచరులకు దక్కలేదనే కారణంతో పనులను నిలిపివేస్తున్నారని, కొన్ని కాంట్రాక్టులను రద్దు చేయాలని అధికారులను కోరుతున్నారని పేర్కొన్నారు. మేఘారెడ్డి తన అనుచరులను కూడా ఇబ్బందులకు గురిచేస్తున్నారని చిన్నారెడ్డి ఆరోపించారు. దీంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు మరింత ముదురుతున్నాయనే చర్చ మొదలైంది. పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టడం సరికాదని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది.

### "జీవన్ రెడ్డిలా తిరగబడతా" హెచ్చరిక

పరిస్థితులు ఇలాగే కొనసాగితే తాను కూడా జీవన్ రెడ్డిలా పార్టీపై తిరగబడాల్సి వస్తుందని చిన్నారెడ్డి హెచ్చరించారు. అయితే కాంగ్రెస్ పార్టీని వీడే ఆలోచన తనకు లేదని స్పష్టం చేశారు. పార్టీలోనే ఉంటూ తప్పు చేస్తున్న వారిపై పోరాడతానని చెప్పారు. "పార్టీ వదిలి వెళ్లను.. మేఘారెడ్డి లాంటి తప్పుడు గాళ్లను పార్టీ నుంచి తరిమేస్తాను" అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. చిన్నారెడ్డి వ్యాఖ్యలు ఇప్పుడు కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ చర్చకు దారితీశాయి. ఇప్పటికే సీనియర్ నేతల అసంతృప్తి, స్థానిక నేతల మధ్య విభేదాలపై చర్చ జరుగుతున్న సమయంలో ఈ వ్యాఖ్యలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.


### చిన్నారెడ్డికి ఎమ్మెల్యే మేఘా కౌంటర్

వనపర్తి కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిరంగ రచ్చకు దారితీశాయి. గత ఎన్నికల్లో తనకు టికెట్ దక్కకపోవడానికి డబ్బే కారణమని మాజీ మంత్రి చిన్నారెడ్డి చేసిన ఆరోపణలపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తీవ్రంగా స్పందించారు. చిన్నారెడ్డి వ్యాఖ్యలను ఖండించిన ఆయన.. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్టానం శాస్త్రీయంగా సర్వే నిర్వహించి, గెలిచే అవకాశాలు ఉన్న అభ్యర్థులకే టికెట్లు కేటాయించిందని స్పష్టం చేశారు. అనవసర ఆరోపణలు చేయడం సరికాదని మండిపడ్డారు. తాను డబ్బులు ఇచ్చి టికెట్ తెచ్చుకున్నానని చిన్నారెడ్డి ఆరోపిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి ఘాటుగా స్పందించారు. "నేను ఎవరికి డబ్బులు ఇచ్చానో.. వారి పేర్లను ధైర్యంగా బయటపెట్టండి" అంటూ చిన్నారెడ్డికి సవాల్ విసిరారు.

### అస్త్ర సన్యాసం చేసింది చిన్నారెడ్డే..!

2014, 2018 ఎన్నికల్లో ఇకపై తాను పోటీ చేయబోనని, పార్టీ అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా వారి గెలుపు కోసం పనిచేస్తానని చిన్నారెడ్డి గతంలో చెప్పిన మాటలను గుర్తుచేశారు. ఇప్పుడు అందుకు భిన్నంగా మాట్లాడటం ఎందుకని ప్రశ్నించారు. చిన్నారెడ్డి ఈ విధంగా ఎందుకు మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని మేఘారెడ్డి వ్యాఖ్యానించారు. వనపర్తి నియోజకవర్గంలో అనవసర వ్యాఖ్యలు చేస్తూ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆరోపించారు. చిన్నారెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్టాన పెద్దలకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. మొత్తంగా వనపర్తి కాంగ్రెస్‌లో ఈ వివాదం ఎటు దారితీస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# భార్యను వదిలేసి ఇంకో పెళ్లా?




భార్యకు విడాకులు ఇవ్వకుండానే మరో వివాహం చేసుకునే ప్రభుత్వ ఉద్యోగులపై అసోం ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ వెల్లడించిన వివరాల ప్రకారం.. మొదటి భార్యను చట్టబద్ధంగా విడిచిపెట్టకుండా మరో మహిళను వివాహం చేసుకున్న ఉద్యోగి జీతంలో 20 శాతం కోత విధించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. కోత విధించిన మొత్తాన్ని మొదటి భార్య బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేసే అవకాశం ఉంది. అయితే ఇందుకోసం బాధిత భార్య ప్రభుత్వం వద్ద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి ఘటనల్లో మొదటి భార్యకు న్యాయపరమైన పరిష్కారం వచ్చే వరకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా చూడడమే ఈ ప్రతిపాదన ఉద్దేశమని సీఎం తెలిపారు. విడాకులు లేకుండా రెండో పెళ్లి చేస్తే జీతానికే గండి పడేలా కొత్త నిబంధనలు తీసుకురావాలన్న ఆలోచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది.

### కోర్టు కేసు ఉన్నా కోత

మొదటి భార్యను వదిలేసి మరో వివాహం చేసుకున్న ఉద్యోగులపై కేవలం జీతం కోతతో ఆగకుండా చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని అసోం ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇలాంటి అనేక ఘటనలు తమ దృష్టికి రావడంతో ఈ నిర్ణయాన్ని పరిశీలిస్తున్నట్లు హిమంత బిస్వ శర్మ చెప్పారు. కోర్టులో కేసు నడుస్తున్న సమయంలో కూడా జీతంలో 20 శాతం కోత కొనసాగించే అవకాశం ఉందన్నారు. దీంతో న్యాయ ప్రక్రియ పూర్తయ్యే వరకు మొదటి భార్యకు కనీస ఆర్థిక భద్రత కల్పించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అసోంలో ఇప్పటికే బహుభార్యత్వాన్ని నిషేధించే నిబంధనలు అమల్లోకి వచ్చాయి. యూనిఫామ్ సివిల్ కోడ్ పరిధిలో బహుభార్యత్వంపై నిషేధం తీసుకొచ్చిన రాష్ట్రంగా అసోం ముందుకు సాగుతోంది. ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ రూల్స్‌లోనూ రెండో వివాహంపై పరిమితులు ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది.

### ప్రైవేట్ ఉద్యోగులపైనా నిఘా?

ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న మహిళల రక్షణపైనా అసోం ప్రభుత్వం దృష్టి పెట్టింది. భర్త విడిచిపెట్టిన మహిళలకు ప్రైవేట్ రంగంలోనూ ఆర్థిక భద్రత కల్పించేలా ప్రత్యేక చట్టపరమైన చర్యలను పరిశీలిస్తున్నట్లు సీఎం సంకేతాలు ఇచ్చారు. ప్రస్తుతానికి ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో చర్యలు తీసుకునే విధానంపై చర్చ జరుగుతోంది. భర్త విడాకులు తీసుకోకుండా మరో వివాహం చేసుకుంటే.. మొదటి భార్య కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా ఇబ్బంది పడకుండా చేయాలన్నదే ప్రతిపాదన వెనుక ఉద్దేశం. రెండో పెళ్లి చేస్తే ఇక కుటుంబ వివాదమే కాదు.. జీతానికీ లెక్క ఉంటుందన్న సంకేతాన్ని అసోం ప్రభుత్వం ఇస్తోంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ఇలాంటి నిబంధనలపై చర్చ మొదలయ్యే అవకాశం ఉంది.

# 16 ఏళ్లకే వరల్డ్ రికార్డు



### చార్టర్డ్ అకౌంటెంట్ సంచలనం

16 ఏళ్ల వయసులోనే లక్ష్మణన్ మెయ్యప్పన్ ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కుడైన పురుష చార్టర్డ్ అకౌంటెంట్‌గా గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. 16 ఏళ్ల 141 రోజుల వయసులో దుబాయ్‌లో ఈ రికార్డును సొంతం చేసుకున్నారు. కోవిడ్ సమయంలో పదో తరగతి పూర్తి చేసిన తర్వాత ఆర్థిక రంగంపై ఆసక్తి పెంచుకున్న లక్ష్మణన్ 15 ఏళ్లకే ACCA చదువు ప్రారంభించి సుమారు ఏడాదిలో పూర్తి చేశారు. అనంతరం సీఎఫ్ఏ అర్హత సాధించాడు. ప్రస్తుతం ఫైనాన్స్‌లో ఎమ్మెస్సీ చదువుతూ దుబాయ్‌లోని సెంచరీ ఫైనాన్షియల్ సంస్థలో సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్‌గా పనిచేస్తున్నారు. పెట్టుబడులు, మార్కెట్ విశ్లేషణ, ఆర్థిక నిర్ణయాలకు సంబంధించిన అంశాల్లో పనిచేస్తున్నారు. తల్లి కూడా ఏసీసీఏ కావడంతో చిన్నప్పటి నుంచే అకౌంటింగ్‌పై ఆసక్తి పెరిగినట్లు తెలుస్తోంది. చదువును వేగంగా పూర్తి చేయడం తన లక్ష్యం కాదని, ఆర్థిక వ్యవస్థను లోతుగా అర్థం చేసుకోవడమే ముఖ్యమని లక్ష్మణన్ చెబుతున్నారు. చదువుతో పాటు ఖాళీ సమయంలో వాచీల డిజైన్, తయారీలోనూ ఆసక్తి చూపుతున్నారు. చిన్న వయసులోనే వృత్తిపరమైన అర్హతలు సాధిస్తూ, ఉన్నత విద్య కొనసాగిస్తూ, ఉద్యోగ అనుభవం పొందుతున్న లక్ష్మణన్ ప్రయాణం విద్యార్థులకు కొత్త స్ఫూర్తిగా నిలుస్తోంది.



# ఒమన్‌కు బాంబ్ బెదిరింపు

- ట్రంప్ హెచ్చరికతో దుమారం
- హర్మూజ్ కోసం అమెరికా గేమ్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తారస్థాయికి చేరాయి. ఇరాన్‌తో అమెరికా ఒప్పందానికి ఒమన్ అడ్డుపడితే సైనిక చర్యకు దిగుతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక చేసినట్లు రాయిటర్స్ వెల్లడించింది. ఇరాన్ అణు కార్యక్రమం, హోర్ముజ్ జలసంధి నియంత్రణ విషయంలో అమెరికా కఠిన వైఖరి కొనసాగిస్తోంది. ఇరాన్ మాత్రం లొంగిపోవాలని ట్రంప్ డిమాండ్ చేశారు. ఈ పరిణామంతో ఇప్పటికే యుద్ధ ఉద్రిక్తతలతో ఉక్కిరిబిక్కిరవుతున్న గల్ఫ్ ప్రాంతంలో మరోసారి ఆందోళన నెలకొంది.

### హర్మూజ్.. అసలు పంచాయితీ

ఇరాన్, ఒమన్ అధికారులు కొంతకాలంగా హర్మూజ్ జలసంధి ద్వారా సముద్ర రవాణా భవిష్యత్తుపై చర్చలు జరుపుతున్నారు. ఇరాన్ విదేశాంగ శాఖ కూడా ఇరు దేశాలు సంయుక్త ప్రకటనపై పనిచేస్తున్నట్లు తెలిపింది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన ఈ జలమార్గంపై నియంత్రణ ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య ప్రధాన వివాదంగా మారింది. హర్మూజ్‌లో రాకపోకలు తీవ్రంగా దెబ్బతినడంతో చమురు సరఫరాపై కూడా ప్రభావం పడుతోంది. ట్రంప్ ఇప్పటికే ఈ జలసంధిపై అమెరికా నియంత్రణ ఉండాలని పట్టుబడుతున్నారు. ఇరాన్ మాత్రం హోర్మూజ్ తమ ఆధీనంలోనే ఉంటుందని స్పష్టం చేస్తోంది.

### ఒమన్ మధ్యవర్తిత్వానికి షాక్

ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఒమన్ మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ట్రంప్ తాజా హెచ్చరిక ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు ఇరాన్ కూడా చర్చలు విఫలమైతే హోర్మూజ్‌లో మరింత దూకుడైన సైనిక చర్యలకు దిగే అవకాశం ఉందని హెచ్చరిస్తోంది. దీంతో ఒకవైపు దౌత్య చర్చలు.. మరోవైపు యుద్ధ బెదిరింపులు సాగుతున్నాయి. ఈ పరిణామాలు ముదిరితే హర్మూజ్ జలసంధి మాత్రమే కాదు.. ప్రపంచ చమురు సరఫరా, ఇంధన ధరలు, అంతర్జాతీయ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ట్రంప్ వ్యాఖ్యల తర్వాత ఇప్పుడు అందరి చూపు ఒమన్, ఇరాన్, అమెరికా తదుపరి అడుగులపైనే ఉంది.

# ఇంటి పెరట్లో గంజాయి సాగు..!

- ఇద్దరి అరెస్ట్.. 500 గ్రాములు స్వాధీనం

వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల మండలం ఎర్రబెల్లి గ్రామంలో ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు సాగు చేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామానికి చెందిన చింత శేఖర్ (62), చింత రమణ (44) గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు గుర్తించిన పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 5 గంజాయి మొక్కలు, సుమారు 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పులివెందుల అర్బన్ సీఐ శ్రీరామ్ తెలిపారు. నిందితులను ఆగస్టు 17న పులివెందుల మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, ఇద్దరికీ రిమాండ్ విధించినట్లు పోలీసులు వెల్లడించారు. గంజాయి సాగు, విక్రయం, వినియోగానికి పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని సీఐ శ్రీరామ్ హెచ్చరించారు.



# మార్కాపురం పేరులో చంద్రన్న ముద్ర?

- జిల్లా పేరుపై ఎమ్మెల్యే సంచలన ప్రతిపాదన
- చిరకాల కల నెరవేరిన వేళ కొత్త డిమాండ్




పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ప్రత్యేక జిల్లా ఏర్పాటు పూర్తయిన నేపథ్యంలో ఇప్పుడు మార్కాపురం జిల్లా పేరును మార్చాలన్న ప్రతిపాదన రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. మార్కాపురం జిల్లాకు "చంద్రన్న మార్కాపురం"గా పేరు పెట్టాలని స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరుతున్నారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వినతిపత్రం అందించారు. జిల్లా పేరును మార్చుతూ శాసనసభలో తీర్మానం చేయాలని స్పీకర్‌ను కోరారు. ఇది కేవలం ఎమ్మెల్యే వ్యక్తిగత అభిప్రాయం కాదని, మార్కాపురం ప్రాంత ప్రజల కోరికగా ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు.

### అసలు చంద్రబాబు పేరే ఎందుకు?

ఈ ప్రతిపాదన వెనుక ప్రధాన కారణం మార్కాపురం ప్రత్యేక జిల్లా ఏర్పాటు విషయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ. పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి ప్రత్యేక జిల్లా కావాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీల్లో ఈ అంశం కూడా ఉంది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేసింది. 2026 జనవరి నుంచి మార్కాపురం జిల్లా అధికారికంగా అమల్లోకి వచ్చింది. దీంతో తమ ప్రాంత చిరకాల డిమాండ్‌ను నెరవేర్చిన చంద్రబాబుకు కృతజ్ఞతగా జిల్లా పేరులో ఆయన పేరును చేర్చాలని ఎమ్మెల్యే ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. రాజకీయంగా చూస్తే ఇది చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయానికి కృతజ్ఞతగా తీసుకున్న ప్రతిపాదనగా కనిపిస్తోంది.

### నాలుగు నియోజకవర్గాలతో కొత్త జిల్లా

మార్కాపురం కేంద్రంగా ఏర్పడిన జిల్లాలో మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాలు ఉన్నాయి. బాపట్ల జిల్లాలోని అద్దంకి, నెల్లూరు జిల్లాలోని కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో విలీనం చేశారు. కొత్త మార్కాపురం జిల్లాలో 21 మండలాలు, 508 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. జిల్లాకు సుమారు 14.83 లక్షల ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇదే సమయంలో మార్కాపురం కేంద్రంగా పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మార్కాపురం, గిద్దలూరు, పొదిలి, కనిగిరి మున్సిపాలిటీలతో పాటు 21 మండలాలను కలుపుతూ అభివృద్ధి సంస్థ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లాకు "చంద్రన్న మార్కాపురం" పేరు వస్తుందా? లేక ప్రస్తుత మార్కాపురం పేరే కొనసాగుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఎమ్మెల్యే ఇచ్చిన వినతిపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే తదుపరి అడుగు ఆధారపడి ఉంది.

# టార్గెట్ 2029

## బీజేపీ టీమ్ రెడీ!

- ముగ్గురు మాజీ సీఎంలు, 18 మంది ఎంపీలు
- నితిన్ నబీ జంబో టీమ్



2029 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ తన జాతీయ కార్యవర్గాన్ని వ్యూహాత్మకంగా సిద్ధం చేసింది. మొత్తం 64 మంది జాతీయ పదాధికారులతో కొత్త టీమ్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో పరిపాలనా అనుభవం, సంస్థాగత నైపుణ్యం, యువత, ప్రాంతీయ సమతుల్యతకు ప్రాధాన్యం ఇచ్చింది. దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా పార్టీ విస్తృత రాజకీయ దృష్టిని చాటుకుంది. కొత్త జాతీయ అధ్యక్షుడి టీమ్‌లో అనుభవజ్ఞులతో పాటు భిన్న సామాజిక వర్గాలకు చెందిన నేతలకు స్థానం కల్పించారు. 40 శాతానికి పైగా పదాధికారులు వెనుకబడిన వర్గాలకు చెందిన వారే కావడం ప్రత్యేకతగా నిలిచింది. దీంతో 2029 ఎన్నికలకు ఇప్పటి నుంచే సంస్థాగతంగా బలమైన పునాది వేయాలన్న బీజేపీ వ్యూహం స్పష్టమవుతోంది.

### ఈశాన్యంపై ప్రత్యేక ఫోకస్

కొత్త టీమ్‌లో ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. త్రిపుర, అసోం, నాగాలాండ్ నుంచి ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు నేతలకు కీలక స్థానం దక్కింది. ఈశాన్య రాష్ట్రాల్లో పార్టీ బలోపేతానికి కొనసాగుతున్న నార్త్‌ఈస్ట్ కోఆర్డినేషన్ సెల్‌కు సంబిత్ పాత్రా నాయకత్వం వహించనున్నారు. గిరిజన వర్గాలకు చెందిన నలుగురు నేతలకు కూడా జాతీయ టీమ్‌లో చోటు కల్పించారు. పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఈశాన్య ప్రాంతాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం ఇచ్చారు. ఎస్సీ వర్గానికి ఉత్తరప్రదేశ్, తమిళనాడు, మధ్యప్రదేశ్ నుంచి ముగ్గురు నేతలకు ప్రాతినిధ్యం కల్పించారు. మహిళలకు కూడా పెద్దపీట వేసి 10 మంది అనుభవజ్ఞులైన మహిళా నేతలను జాతీయ పదవుల్లోకి తీసుకున్నారు. మతపరమైన వైవిధ్యానికి కూడా ప్రాధాన్యం కనిపించింది. ఒక సిక్కు, ఇద్దరు క్రైస్తవులు, ఒక ముస్లిం, ఒక జైన, ఒక పార్సీ నేతకు టీమ్‌లో స్థానం కల్పించారు.

### ముగ్గురు మాజీ సీఎంలు

బీజేపీ కొత్త టీమ్‌లో పరిపాలనా అనుభవానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. మాజీ ముఖ్యమంత్రులు వసుంధర రాజే, తీరత్ సింగ్ రావత్, బిప్లబ్ కుమార్ దేవ్కు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించారు. పలువురు మాజీ రాష్ట్ర అధ్యక్షులకు కూడా చోటు కల్పించారు. కేంద్ర ప్రభుత్వంలో గతంలో పనిచేసిన నలుగురు నేతలతో పాటు ఒక కేంద్ర మంత్రికి కూడా జాతీయ టీమ్‌లో స్థానం దక్కింది. ఇక లోక్‌సభ, రాజ్యసభలకు చెందిన 18 మంది ప్రస్తుత ప్రజాప్రతినిధులు ఈ బృందంలో ఉండటం మరో కీలక అంశం. వీరి ద్వారా పార్లమెంటరీ అనుభవం, ప్రజలతో ప్రత్యక్ష సంబంధం పార్టీ జాతీయ వ్యవస్థకు చేరనుంది. విద్యా, వృత్తి రంగాల్లోనూ వైవిధ్యం కనిపిస్తోంది. ఇద్దరు ప్రొఫెసర్లు, నలుగురు వైద్యులు, పీహెచ్‌డీలు, ఇంజినీర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, న్యాయవాదులు జాతీయ టీమ్‌లో ఉన్నారు. మోర్చా విభాగాల్లో చేసిన నియామకాలు క్షేత్రస్థాయి అనుభవానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు చూపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే అనుభవం, సామాజిక సమీకరణం, ప్రాంతీయ సమతుల్యత, యువ శక్తి కలయికతో బీజేపీ 2029 కోసం తన జాతీయ యంత్రాంగాన్ని సిద్ధం చేసినట్లు కనిపిస్తోంది.

# బీజేపీ డిజిటల్ టీమ్‌లో భారీ మార్పులు

## మాలవీయ ఔట్.. మహస్కేకు బాధ్యతలు



ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ బీజేపీ తన డిజిటల్ ప్రచార యంత్రాంగంలో కీలక మార్పు చేసింది. పార్టీ జాతీయ బృందం పునర్వ్యవస్థీకరణలో భాగంగా దీపక్ మహస్కేను సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమించింది. ఇప్పటివరకు బీజేపీ ఐటీ వ్యవహారాలను ముందుండి నడిపించిన అమిత్ మాలవీయ స్థానంలో మహస్కే బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయనకు సహకరించేందుకు ప్రీతి గాంధీ, శివానంద్ ద్వివేది, అలోక్ భట్, అరుణ్ యాదవ్‌లను సోషల్ మీడియా కోకన్వీనర్లుగా నియమించారు. దశాబ్ద కాలంగా తనతో కలిసి పనిచేసిన కొత్త బృందానికి మాలవీయ స్వయంగా అభినందనలు తెలిపారు. బీజేపీ డిజిటల్ కమ్యూనికేషన్‌ను మరింత ప్రభావవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లో సోషల్ మీడియా ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఈ మార్పు ప్రాధాన్యం సంతరించుకుంది.

### కమ్యూనికేషన్‌కు అనిల్ బలూనీ

సోషల్ మీడియా విభాగంతో పాటు పార్టీ మొత్తం కమ్యూనికేషన్ వ్యూహానికి కూడా బీజేపీ కొత్త బాధ్యతలు అప్పగించింది. అనిల్ బలూనీని మీడియా కోఆర్డినేటర్‌గా నియమించారు. ఆయనకు సహకరించేందుకు ఆశిష్ ఉషా అగర్వాల్, ప్రదీప్ భండారీ, సిద్ధార్థ్ యాదవ్‌లను జాయింట్ కోఆర్డినేటర్లుగా నియమించారు. ప్రజలతో నేరుగా సంబంధాలు ఏర్పరుచుకోవడంలో సోషల్ మీడియా కీలక వేదికగా మారిన నేపథ్యంలో బీజేపీ ఈ విభాగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొత్త బృందానికి అభినందనలు తెలిపారు. సంస్థాగత అనుభవం, శక్తి, క్షేత్రస్థాయి అనుసంధానంతో కొత్త టీమ్ పార్టీని మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విధానాలు, కార్యక్రమాలు, రాజకీయ సందేశాలను ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లడం కొత్త టీమ్‌కు ప్రధాన సవాలుగా మారనుంది.

### సీనియర్లకు కీలక బాధ్యతలు

కొత్త జాతీయ టీమ్‌లో డిజిటల్ విభాగంతో పాటు సీనియర్ నేతలకు కూడా కీలక బాధ్యతలు దక్కాయి. వసుంధర రాజే, స్మృతి ఇరానీ, రామ్ మాధవ్, పీయూష్ గోయల్, బైజయంత్ పాండా వంటి నేతలకు ముఖ్య పదవులు లభించాయి. సంస్థాగత వ్యవహారాల్లో కీలకంగా ఉన్న బీఎల్ సంతోష్‌ను జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్గనైజేషన్‌గా కొనసాగించారు. ఆయనకు సహకరించేందుకు శివప్రకాశ్, సౌదాన్ సింగ్‌లను జాయింట్ జనరల్ సెక్రటరీలుగా నియమించారు. స్మృతి ఇరానీకి ఉత్తరప్రదేశ్ బాధ్యతలతో జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి దక్కింది. వినోద్ తావ్డే, సునీల్ బన్సల్, బిప్లబ్ కుమార్ దేవ్, సతీశ్ పూనియా, గజేంద్ర పటేల్, హరీశ్ ద్వివేది, సంజయ్ భాటియా కూడా ప్రధాన కార్యదర్శుల బృందంలో ఉన్నారు. మొత్తంగా చూస్తే డిజిటల్ ప్రచారం, మీడియా వ్యూహం, సంస్థాగత బలం.. ఈ మూడు రంగాలను ఒకేసారి పదును పెట్టేలా బీజేపీ కొత్త టీమ్‌ను సిద్ధం చేసినట్లు కనిపిస్తోంది.

# రామమందిర విరాళాల కేసు

- సిట్ దర్యాప్తుపైనే నమ్మకం
- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సోమవారం విచారణ సందర్భంగా "సిట్ తన పని సంతృప్తికరంగా చేస్తే మంచిదే.. మరింత దర్యాప్తు అవసరమైతే జోక్యం చేసుకుంటాం" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసును రాజకీయ రంగు పులమకుండా నేరుగా దర్యాప్తు కోణంలోనే చూడాలని కోర్టు ఇప్పటికే సూచించింది. సిట్ దర్యాప్తును పూర్తి చేసి, ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతం దర్యాప్తు బాధ్యత పూర్తిగా సిట్ చేతుల్లోనే ఉందన్న సంకేతాన్ని సుప్రీంకోర్టు ఇచ్చింది.

### ఫిర్యాదులుంటే సొలిసిటర్ జనరల్‌కు

విరాళాల నిర్వహణపై పూర్తి వివరాలు వెల్లడించాలని పిటిషనర్లు కోరారు. ఎఫ్ఐఆర్‌లోని వివరాలు కూడా తమకు చూపించలేదని కొందరు పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. విరాళాల లెక్కలు, నగదు, బ్యాంకు బదిలీలు, డిజిటల్ చెల్లింపులు, విదేశీ విరాళాలు, బంగారం, వెండి వంటి విలువైన వస్తువుల వివరాలను వెల్లడించాలని మరో పిటిషన్‌లో కోరారు. దీనిపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరపున న్యాయవాది విరాళాల నిర్వహణ జరుగుతోందని కోర్టుకు తెలిపారు. దర్యాప్తులో మరింత లోతుగా పరిశీలించాల్సిన అంశాలు ఉన్నాయని భావించే నిజమైన ఆసక్తి ఉన్న వ్యక్తులు సొలిసిటర్ జనరల్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ధర్మాసనం సూచించింది. అక్కడి నుంచి వచ్చిన సూచనలను పరిశీలించి అవసరమైతే సిట్‌కు పంపిస్తామని తెలిపింది. దర్యాప్తులో లోపాలుంటే వాటిని న్యాయపరమైన మార్గంలో తెలియజేసే అవకాశం కల్పించింది.

### జూలైలోనే సిట్ ఏర్పాటు

రామమందిర ట్రస్ట్ నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూలై 25న సిట్‌ను ఏర్పాటు చేసింది. జూలై 27న ఈ అంశాన్ని సుప్రీం కోర్టు రికార్డులోకి తీసుకుంది. లక్నో రేంజ్ ఐజీ కిరణ్ ఎస్ నేతృత్వంలో సిట్ పనిచేస్తోంది. అయోధ్య రేంజ్ డీఐజీ సోమెన్ బర్మా, అయోధ్య జిల్లా ఎస్ఎస్పీ గౌరవ్ గ్రోవర్, బారాబంకీ అదనపు ఎస్పీ రితేష్ కుమార్ సింగ్ సభ్యులుగా ఉన్నారు. నిధుల దుర్వినియోగ



ఆరోపణల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా దర్యాప్తులో భాగం చేశారు. మరోవైపు ఎలక్ట్రానిక్ ఆధారాలు, ముఖ్యంగా సీసీటీవీ ఫుటేజీ భద్రపరచాలని పిటిషనర్లు కోరారు. అవి తొలగిపోవడం, ఓవర్‌రైట్ కావడం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సుప్రీం కోర్టు వైఖరి స్పష్టంగా ఉంది — సిట్ దర్యాప్తును ముందుకు తీసుకెళ్లాలి.. దర్యాప్తు సంతృప్తికరంగా లేకపోతేనే కోర్టు జోక్యం చేసుకుంటుంది.

# రాహుల్ ఆస్తుల కేసు దర్యాప్తు

- విచారణ సంస్థలపై సుప్రీం ఆగ్రహం
- సీరియస్ అయితే ఇంతకాలం ఎందుకు?




కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై నమోదైన అక్రమాస్తుల ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారం నిజంగా అంత తీవ్రమైనదైతే.. దర్యాప్తు సంస్థలు ఇంతకాలం ఏం చేస్తున్నాయని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనా ధర్మాసనం సోమవారం రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ కేసులో అలహాబాద్ హైకోర్టు తదుపరి విచారణను ముందుకు తీసుకెళ్లకుండా సుప్రీంకోర్టు సూచించింది. అలాగే సీబీఐ, ఈడీలు తమ దర్యాప్తు నివేదికలను ఎలాంటి అధికార సంస్థకు, అలహాబాద్ హైకోర్టుకు కూడా సమర్పించవద్దని ఆదేశించింది. ఆగస్టు 20న అలహాబాద్ హైకోర్టులో జరగాల్సిన విచారణను కూడా తదుపరి ఉత్తర్వుల వరకు వాయిదా వేయాలని పేర్కొంది.

### సీబీఐ, ఈడీపై ధర్మాసనం ఆగ్రహం

రాహుల్ గాంధీ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తూ.. ఈ కేసు చట్టపరమైన ఆధారం లేని "విచ్ హంట్" ప్రక్రియగా అభివర్ణించారు. ఫిర్యాదుదారు హైకోర్టును ఆశ్రయించే అర్హతపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. సీబీఐ ఇప్పటివరకు ఫిర్యాదును పరిశీలించడం తప్ప మరేమీ చేయలేదని కోర్టుకు తెలిపారు. కేంద్ర దర్యాప్తు సంస్థల తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి. రాజు స్పందిస్తూ.. ప్రస్తుత దశలో తమకు ప్రత్యక్ష పాత్ర లేదన్నారు. ఆరోపణల్లో గుర్తించదగిన నేరం ఉన్నట్లు తేలితే మాత్రం అది తీవ్రమైన అంశమని పేర్కొన్నారు. ఈ సమయంలో ధర్మాసనం "అంత తీవ్రమైన కేసు అయితే మీ సంస్థ ఇంతకాలం ఎందుకు మౌనంగా ఉంది?" అని ప్రశ్నించింది. స్వయంగా దర్యాప్తు ప్రారంభించారా? కోర్టు ఆదేశం కోసం ఎదురు చూస్తున్నారా? అంటూ న్యాయమూర్తి జాయ్‌మాల్య బాగ్చీ ప్రశ్నించారు.

### హైకోర్టు ఆదేశాలపై సుప్రీం బ్రేక్

రాహుల్ గాంధీపై అక్రమాస్తుల ఆరోపణలకు సంబంధించి దర్యాప్తు చేయాలని గతంలో అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ వ్యవహారంలో సీబీఐ, ఈడీలు ఆరోపణలను పరిశీలించాలని హైకోర్టు సూచించింది. జూలై 20న లక్నో బెంచ్ సీబీఐ దర్యాప్తు పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేసి.. సంస్థలోని సీనియర్ అధికారి స్వయంగా కొత్త అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం విచారణలో సుప్రీం ధర్మాసనం హైకోర్టు తదుపరి చర్యలకు తాత్కాలికంగా బ్రేక్ వేసింది. అయితే ఆరోపణలు నిజమా? కాదా? అన్న అంశంపై సుప్రీంకోర్టు తుది నిర్ణయం ఇవ్వలేదు. దర్యాప్తు సంస్థలు ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదన్న ప్రశ్న మాత్రం ఈ కేసులో కీలకంగా మారింది.

# అనసూయకు బిగ్ షాక్..

- మాటలతో మొదలైన మంట
- పోలీస్ స్టేషన్‌కు పంచాయితీ!



అనసూయ పేరు చెబితేనే సోషల్ మీడియా అలర్ట్ అవుతుంది.. ఇప్పుడు బోరబండ పోలీస్ స్టేషన్ పేరు కూడా యాడ్ అయింది! ఓ వైపు యాంకరింగ్.. మరోవైపు యాక్టింగ్.. ఇంకోవైపు సోషల్ మీడియా కామెంట్స్.. ఇలా ఎక్కడ మైక్ కనిపించినా మసాలా కంటెంట్ రెడీ అన్నట్టుగా పరిస్థితి మారింది. తాజాగా 'జై శ్రీరామ్' నినాదం చుట్టూ ఆమె చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు ఫైర్ అయ్యారు. హిందూ మతంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సోషల్ మీడియాలో మొదలైన వివాదం పోలీస్ స్టేషన్ మెట్లెక్కింది. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. బీజేపీ నేతలు యాక్షన్ కోరుతుంటే.. అనసూయ మాత్రం బ్యాక్‌ఫుట్‌లోకి వెళ్లడం లేదు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానంటోంది.

### స్టేషన్‌లో పంచాయితీ.. సీన్ రివర్స్!

బీజేపీ నేతల ఆరోపణ ఏంటంటే.. అనసూయ వ్యాఖ్యలు కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని. అందుకే చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటున్నారు. సోషల్ మీడియాలో మతపరమైన అంశాలపై మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని కూడా వార్నింగ్ ఇచ్చారు. అయితే అనసూయ వర్షన్ మాత్రం వేరే. తాను ఏ మతాన్ని, ఏ వర్గాన్ని కించపరిచే ఉద్దేశంతో మాట్లాడలేదని.. కొందరి ప్రవర్తనను మాత్రమే ప్రశ్నించానని ఆమె వివరణ ఇచ్చారు. పైగా తన మాటలను కావాలనే కట్ చేసి, వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. "నా మాటలతో దొంగలంతా బయటకు వస్తున్నారు" అంటూ విమర్శకులకు కౌంటర్ ఇచ్చినట్లు సమాచారం. దీంతో సీన్ సాధారణ సోషల్ మీడియా గొడవలా కాకుండా.. పోలీస్ కంప్లైంట్ దశకు చేరింది. ఇప్పుడు అసలు హాట్ టాపిక్ ఏంటంటే.. ఈ ఫిర్యాదుపై పోలీసులు తదుపరి ఏం చేస్తారు? అనసూయకు నోటీసులు వస్తాయా? వివాదం ఇంకెంత దూరం వెళ్తుంది? అన్నదే. మొత్తానికి ఒక కామెంట్.. రెండు వర్గాల కౌంటర్లు.. చివరికి పోలీస్ స్టేషన్! టాలీవుడ్‌లో ఈ ఎపిసోడ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

### అనసూయ తగ్గేదేలే.. కేసు ఎటు?

ఇప్పటికే అనసూయ తన వ్యాఖ్యలపై వెనక్కి తగ్గే ప్రసక్తి లేదన్నట్టుగా స్పందించారు. తాను చెప్పిన విషయానికి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. మరోవైపు బీజేపీ నేతలు మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందే అని డిమాండ్ చేస్తున్నారు. పోలీసుల పరిశీలనలో వీడియో క్లిప్పులు, వ్యాఖ్యల నేపథ్యం కీలకంగా మారే అవకాశం ఉంది.

# అఫ్గానిస్థాన్‌లో ఐదేళ్ల పాలన

- ఢిల్లీలో తాలిబన్ల సంబరాలు

అఫ్గానిస్థాన్‌లో తాలిబన్ పాలన ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలోని అఫ్గానిస్థాన్ రాయబార కార్యాలయంలో తొలిసారిగా 'విక్టరీ డే' వేడుకలు నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముంబై అఫ్గానిస్థాన్ కాన్సుల్ జనరల్ డాక్టర్ ఇక్రముద్దీన్ కామిల్, అఫ్గాన్ రాయబార కార్యాలయ సీడీఏ ముఫ్తీ నూర్ అహ్మద్ నూర్ పాల్గొన్నారు. భారత విదేశాంగ శాఖకు చెందిన పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, ఇరాన్ విభాగం జాయింట్ సెక్రటరీ ఎం. ఆనంద్ ప్రకాశ్ కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. 2021 ఆగస్టు 15న అమెరికా, నాటో దళాలు అఫ్గానిస్థాన్ నుంచి వైదొలిగిన సమయంలో తాలిబన్లు దేశాధికారాన్ని చేపట్టారు. అప్పటి నుంచి ఐదేళ్లుగా తాలిబన్ పాలన కొనసాగుతోంది.

### సంక్షోభాల మధ్య పాలన

ఐదేళ్ల పాలనను తాలిబన్లు తమ విజయంగా ప్రదర్శిస్తున్నా.. అఫ్గానిస్థాన్‌లో పరిస్థితులపై అంతర్జాతీయ సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మానవతా సంక్షోభం, ఆర్థిక ఇబ్బందులు, మహిళల హక్కులపై ఆంక్షలు దేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఐక్యరాజ్యసమితి, ఇతర సంస్థలు చెబుతున్నాయి. ముఖ్యంగా మహిళలు, బాలికలపై విధిస్తున్న కఠిన




నిబంధనలు అంతర్జాతీయ విమర్శలకు కారణమవుతున్నాయి. విద్య, ఉపాధి, సామాజిక కార్యకలాపాల్లో మహిళలకు అనేక పరిమితులు కొనసాగుతున్నాయి. తాలిబన్ ప్రభుత్వం దేశంలో నియంత్రణ సాధించామని చెబుతున్నా.. ప్రజల జీవన పరిస్థితులు మాత్రం ఇంకా సవాళ్లతోనే ఉన్నాయని సహాయ సంస్థలు పేర్కొంటున్నాయి. ప్రకృతి విపత్తులు, ఆహార కొరత, మానవతా అవసరాలు కూడా అఫ్గానిస్థాన్‌ను వెంటాడుతున్నాయి.

తాలిబన్ పాలన ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అఫ్గానిస్థాన్‌లో వీధి ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. తమ పాలనను స్థిరంగా చూపించే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో ఢిల్లీలోని అఫ్గాన్ రాయబార కార్యాలయంలో జరిగిన విజయోత్సవం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది.



# బీజేపీలో.. కీలక వికెట్లు ఔట్!

## ఎవరికి చోటు.. ఎవరికి షాక్?

### కొత్త టీమ్‌తో నబీన్ దూకుడు

2029 లక్ష్యంగా బీజేపీ జాతీయ సంస్థలో భారీ మార్పులు చేసింది. పార్టీ అధ్యక్షుడు నితిన్ నబీన్ నేతృత్వంలో కొత్త జాతీయ టీమ్‌ను ప్రకటించింది. వరుస ఎన్నికలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రాష్ట్రాల వారీగా పార్టీని బలోపేతం చేయడంతో పాటు వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా నియామకాలు చేపట్టింది. మొత్తం 13 మంది జాతీయ ఉపాధ్యక్షులు, 8 మంది జాతీయ ప్రధాన కార్యదర్శులు, 16 మంది జాతీయ కార్యదర్శులు కొత్త టీమ్‌లో ఉన్నారు. మహిళలు, యువత, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, రైతు విభాగాలకు చెందిన మోర్చాలకు కూడా కొత్త నాయకత్వాన్ని ప్రకటించారు. కొత్త నియామకాల్లో కొందరు సీనియర్ నేతలకు తిరిగి కీలక బాధ్యతలు దక్కగా.. మరికొందరు నేతలు తమ పదవులు కోల్పోయారు. దీంతో బీజేపీ కొత్త టీమ్‌పై రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది.

### కీలక పదవుల్లో భారీ మార్పులు

జాతీయ ప్రధాన కార్యదర్శుల విషయంలో బీజేపీ కీలక మార్పులు చేసింది. హరీశ్ ద్వివేది స్థానంలో అరుణ్ సింగ్, స్మృతి ఇరానీ స్థానంలో రాధామోహన్ దాస్ అగర్వాల్, సతీశ్ పూనియా స్థానంలో తరుణ్ చుగ్, గజేంద్ర పటేల్ స్థానంలో దుష్యంత్ గౌతమ్ మారారు. ఖాళీగా ఉన్న స్థానాల్లో బిప్లబ్ దేవ్, సంజయ్ భాటియాకు అవకాశం కల్పించారు. మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించడం కొత్త టీమ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లబ్ కుమార్ దేవ్‌కు కూడా జాతీయ స్థాయిలో తిరిగి కీలక బాధ్యత దక్కింది. మరోవైపు పార్టీ ఐటీ, సోషల్ మీడియా విభాగంలో పెద్ద మార్పు చోటుచేసుకుంది. అమిత్ మాలవీయ స్థానంలో దీపక్ మహస్కేకు సోషల్ మీడియా బాధ్యతలు అప్పగించారు. యువ మోర్చాలోనూ మార్పు చేస్తూ తేజస్వీ సూర్య స్థానంలో హేమంగ్ జోషీని నియమించారు. దీంతో పార్టీ డిజిటల్ ప్రచారం, యువజన విభాగాల్లో కొత్త వ్యూహాలు అమలు చేసే అవకాశం కనిపిస్తోంది.

### మోర్చాలకూ కొత్త ముఖాలు

బీజేపీ సంస్థాగత విస్తరణలో భాగంగా పలు మోర్చాలకు కొత్త నాయకత్వాన్ని ప్రకటించింది. పీయూష్ గోయల్‌కు కోశాధికారి బాధ్యతలు అప్పగించి.. రాజేశ్ అగర్వాల్ స్థానంలో ఆయనను నియమించారు. మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రూప్ కుమారికి అవకాశం ఇచ్చారు. ఓబీసీ మోర్చాకు అమర్‌పాల్ మౌర్య, కిసాన్ మోర్చాకు బన్సీలాల్ గుజ్జర్, ఎస్సీ మోర్చాకు శివేశ్ కుమార్ రామ్, ఎస్టీ మోర్చాకు మంగళం రావత్, మైనార్టీ మోర్చాకు కున్వర్ బాసిత్ అలీని నియమించారు. వివిధ సామాజిక వర్గాలను పార్టీ సంస్థలో మరింత బలోపేతం చేయాలన్న వ్యూహం ఈ నియామకాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ జాతీయ స్థాయిలో భారీ పునర్వ్యవస్థీకరణ చేపట్టిన నేపథ్యంలో ఈ మార్పులు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



సీనియర్ల అనుభవానికి కొత్త తరానికి చెందిన నేతల దూకుడును జోడించి పార్టీని ఎన్నికల రణరంగానికి సిద్ధం చేయడమే లక్ష్యంగా కనిపిస్తోంది. ఎవరి పదవి పోయింది? ఎవరి పట్టు పెరిగింది? ఎవరు కీలక బాధ్యతలు చేపట్టారు? అన్న లెక్కలు ఇప్పుడు బీజేపీ అంతర్గత రాజకీయాల్లో చర్చకు దారితీస్తున్నాయి.

# బీజేపీలో ఏపీకి కీలక పదవులు



### రామ్ మాధవ్, చిన్నమ్మకు ఉపాధ్యక్ష హోదా

### విష్ణువర్ధన్‌కి నేషనల్ బెర్తులు

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సోమవారం పార్టీ జాతీయ కార్యవర్గంలో కీలక మార్పులు చేపట్టారు. కొత్త జాతీయ ఆఫీస్ బేరర్లను ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డి. పురందేశ్వరికి జాతీయ ఉపాధ్యక్ష పదవి కట్టబెట్టారు. రాజమహేంద్రవరం ఎంపీగా ఉన్న పురందేశ్వరికి పార్టీలో కీలక బాధ్యత దక్కడం ఏపీ బీజేపీకి ప్రాధాన్యతగా మారింది. సీనియర్ నేత రామ్ మాధవ్‌కు కూడా జాతీయ ఉపాధ్యక్ష పదవి దక్కింది. దీంతో కొత్త టీమ్‌లో ఏపీకి ప్రాతినిధ్యం మరింత బలపడింది. (5లో..)


# ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి

- డీఎస్సీ నియామకాలపై కుట్రలా?
- డీవియేషన్ ఎక్కడ జరిగింది?
- వైసీపీ తీరుపై చంద్రబాబు ఆగ్రహం

మెగా డీఎస్సీ నియామకాలపై వస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీ వేదికగా గట్టి కౌంటర్ ఇచ్చారు. నియామక ప్రక్రియలో ఎక్కడా డీవియేషన్ జరగలేదని, మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్‌లోనే నిర్వహించామని స్పష్టం చేశారు. 15,941 ఉపాధ్యాయ పోస్టులను కేవలం 148 రోజుల్లో పారదర్శకంగా భర్తీ చేశామని తెలిపారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ల నుంచి రిజర్వేషన్లు, పరీక్షలు, ఫలితాల వరకు ప్రతి దశలో నిబంధనలు పాటించామని చెప్పారు. 13 సబ్జెక్టుల్లో 42 వేల ప్రశ్నలను సిద్ధం చేసి, 154 కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించామని వివరించారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే ఎంపికలు జరిగాయని చంద్రబాబు స్పష్టం చేశారు.

### వైసీపీకి అసెంబ్లీ సవాల్

డీఎస్సీపై వైసీపీ చేస్తున్న విమర్శలను చంద్రబాబు తీవ్రంగా తప్పుబట్టారు. రోడ్డుపై హిట్ అండ్ రన్ తరహాలో ఆరోపణలు చేయడం కాకుండా ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ విసిరారు. రెండున్నరేళ్లుగా అసెంబ్లీకి రాని పార్టీని తన రాజకీయ జీవితంలో చూడలేదని వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి రాకుండా బయట నిరసనలు చేయడం, జీతాలు, ప్రివిలేజీలు తీసుకోవడంపై ప్రశ్నలు సంధించారు. డీఎస్సీ నియామకాలపై కుట్రలు పనిచేయవని ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు భరోసా ఇచ్చారు. ఒడిశా కూలీలు, 90 ఏళ్ల జగన్ జెన్జీలతో ఫేక్ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ వైసీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. (వివరాలు 5లో..)






# పారదర్శకతే మా ఆయుధం

- 148 రోజుల్లో నియామకాలు
- డీఎస్సీపై లోకేశ్ ఫుల్ క్లారిటీ!

మెగా డీఎస్సీ నిర్వహణపై వస్తున్న విమర్శలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో ఘాటుగా సమాధానం ఇచ్చారు. డీఎస్సీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించామని స్పష్టం చేశారు. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించగా, 3,36,300 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మొత్తం నియామక ప్రక్రియను కేవలం 148 రోజుల్లో పూర్తి చేశామని చెప్పారు. టెట్‌ను తప్పనిసరి చేయడం, వర్టికల్ రిజర్వేషన్లు, హారిజంటల్ రిజర్వేషన్లు అమలు చేయడం, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పకడ్బందీగా నిర్వహించడం ద్వారా ఎంపికలు చేపట్టామని వివరించారు. పరీక్షను టీసీఎస్ ఐయాన్ ప్లాట్‌ఫామ్ ద్వారా నిర్వహించినట్లు తెలిపారు. (వివరాలు 2లో..)

# కోర్టు గడప తొక్కిన భార్య వేధింపులకు కోర్టు పిడుగు..!

## కాలయాపన చేస్తే ఇక భారీ మూల్యం




ఒకప్పుడు పెళ్లి పందిరిలో మొదలైన బంధం.. కాలం గడిచేకొద్దీ కష్టాల కడలిగా మారింది. మాటలు మంటలయ్యాయి.. కలిసి జీవించాల్సిన జీవితం నరకప్రాయంగా మారిందన్న ఆరోపణలు వచ్చాయి. చివరకు భర్తతో కలిసి ఉండలేనంటూ భార్య కోర్టు గడప తొక్కింది. విడాకుల కోసం వేసిన అడుగులు.. మూడేళ్ల న్యాయపోరాటంగా మారాయి. ఒకవైపు విడాకులు కావాలంటున్న భార్య.. మరోవైపు కాపురానికి పంపించాలంటున్న భర్త. మధ్యలో లోక్ అదాలత్ రాజీ.. ఆ తర్వాత మళ్లీ హైకోర్టు మెట్లు. కేసు ముగుస్తుందనుకున్న ప్రతిసారీ మరో మలుపు తిరిగింది. కానీ ఈసారి కోర్టు మాత్రం గట్టిగా స్పందించింది. న్యాయ ప్రక్రియను సాగదీస్తే చూస్తూ ఊరుకోబోమని తీర్పుతో స్పష్టం చేసింది. విడాకులు మంజూరు చేయడమే కాదు.. భార్యకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. కుటుంబ వివాదం చివరకు న్యాయస్థానంలో ముగిసినా.. ఈ తీర్పు మాత్రం వేధింపులకు, కాలయాపనకు గట్టి హెచ్చరికగా మారింది. (వివరాలు 5లో..)




# లక్ష కోట్లు ఎవరివి.. ఎక్కడున్నాయి?

- »మర్చిపోయిన డబ్బుపై మళ్లీ ఫోకస్
- »బ్యాంకుల్లో మూలిగిపోతున్న సొమ్ము

ఒకప్పుడు బ్యాంకు ఖాతాలో వేసిన పైసలు.. కాలం గడిచేకొద్దీ ఎవరి జ్ఞాపకాల్లోనూ లేకుండా పోయాయి. చేతిలో ఉన్నప్పుడు చిన్న సొమ్ముల్లా కనిపించిన డబ్బే.. ఏళ్ల తర్వాత లక్షలు, కోట్లుగా మారింది. ఖాతాదారు లేరు.. వారసులకు సమాచారం లేదు.. పాత పాస్‌బుక్ మూలన పడిపోయింది. ఫోన్ నంబర్ మారిపోయింది.. చిరునామా మారిపోయింది. కానీ బ్యాంకులో ఉన్న సొమ్ము మాత్రం అక్కడే ఉంది. అలా దేశవ్యాప్తంగా మర్చిపోయిన ఖాతాలు పెరిగిపోతూ.. చివరకు దాదాపు రూ.లక్ష కోట్ల డిపాజిట్లు ఆర్బీఐకి చేరాయి. ఈ సొమ్ము ఎవరిది? ఏ కుటుంబానికి చెందింది? ఎప్పుడో దాచిన పైసలు ఇప్పుడు ఎక్కడున్నాయి? అనే ప్రశ్నలు ఇప్పుడు ఆసక్తిని రేపుతున్నాయి. ముఖ్యంగా ఇంట్లో పెద్దలు చనిపోయిన తర్వాత వారి బ్యాంకు ఖాతాల గురించి పట్టించుకోని కుటుంబాలు ఒక్కసారి ఆలోచించాల్సిన సమయం వచ్చింది. మీ తాత దాచిన సొమ్మా? మీ నాన్న మరిచిపోయిన డబ్బా? లేక మీ పేరుతోనే ఉన్న పాత ఖాతానా? సమాధానం తెలుసుకోవడానికి ఆర్బీఐ తీసుకొచ్చిన ఉద్గామ్ పోర్టల్ ఇప్పుడు కీలక మార్గంగా మారింది. (వివరాలు 5లో..)




# ఒమన్‌కు బాంబ్ బెదిరింపు

### ట్రంప్ హెచ్చరికతో దుమారం

### హర్మ్యూజ్ కోసం అమెరికా గేమ్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తారస్థాయికి చేరాయి. ఇరాన్‌తో అమెరికా ఒప్పందానికి ఒమన్ అడ్డుపడితే సైనిక చర్యకు దిగుతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక చేసినట్లు రాయిటర్స్ వెల్లడించింది. ఇరాన్ అణు కార్యక్రమం, హార్ముజ్ జలసంధి నియంత్రణ విషయంలో అమెరికా కఠిన వైఖరి కొనసాగిస్తోంది. ఇరాన్ మాత్రం లొంగిపోవాలని ట్రంప్ డిమాండ్ చేశారు. ఈ పరిణామంతో ఇప్పటికే యుద్ధ ఉద్రిక్తతలతో ఉక్కిరిబిక్కిరవుతున్న గల్ఫ్ ప్రాంతంలో మరోసారి ఆందోళన నెలకొంది.



# అఫ్గాన్‌లో ఐదేళ్ల పాలన

### ఢిల్లీలో తాలిబన్ల సంబరాలు

అఫ్గానిస్థాన్‌లో తాలిబన్ పాలన ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలోని అఫ్గానిస్థాన్ రాయబార కార్యాలయంలో తొలిసారిగా 'విక్టరీ డే' వేడుకలు నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముంబై అఫ్గానిస్థాన్ కాన్సుల్ జనరల్ డాక్టర్ ఇక్రముద్దీన్ కామిల్, అఫ్గాన్ రాయబార కార్యాలయ సీడీఏ ముఫ్తీ నూర్ అహ్మద్ నూర్ పాల్గొన్నారు. (3లో..)



# జార్ఖండ్ విద్యార్థుల సెగ

## సోరెన్‌కు రాహుల్ లేఖ

### నిరసనకారులను కలవండి

### సమస్య పరిష్కరించాలని హితవు

జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విద్యార్థుల ఆందోళన కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలకంగా స్పందించారు. తన రాజకీయ మిత్రుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను స్వయంగా నిరసన చేస్తున్న విద్యార్థులను కలవాలని కోరారు. (వివరాలు 5లో..)



# దీక్ష విరమించిన విద్యార్థులు

## 24 రోజుల పోరాటంలో మలుపు

- ఝార్ఖండ్‌లో పరీక్షల రద్దుకు సర్కారుసై
- సీబీఐ విచారణకు పట్టుతో ఉత్కంఠ

ఝార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల అక్రమాలపై విద్యార్థులు చేపట్టిన 24 రోజుల ఉద్యమం కీలక మలుపు తిరిగింది. విద్యార్థుల ఆందోళనకు దిగొచ్చిన ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రభుత్వం 2014 నుంచి జరిగిన పరీక్షలు, నియామకాల్లో తప్పిదాలపై విచారణకు హామీ ఇచ్చింది. జేపీఎస్సీ, జేఎస్సీఎస్సీ సీజీఎల్ సహా పలు పరీక్షలు, నియామకాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. లక్నోకు చెందిన టీఎస్ఆర్ డేటా ప్రాసెసింగ్ సంస్థకు సంబంధించిన ఫలితాలు, ఎంపిక ప్రక్రియలను కూడా రద్దు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. 2014 నుంచి జరిగిన అన్ని పరీక్షలను సీఐడీ విచారించనుంది. పరీక్షా వ్యవస్థలో సంస్కరణల కోసం ఐఏఎస్ అధికారి అమితాభ్ కౌశల్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నారు.

### మహతో దీక్ష విరమణ.. ఉద్యమానికి విరామం

సర్కార్ కీలక నిర్ణయాల నేపథ్యంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి నేత దేవేంద్రనాథ్ మహతో నిరాహార దీక్ష విరమించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయనను కలిసి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించిన తర్వాత ఈ నిర్ణయం వెలువడింది. ప్రభుత్వం అక్రమాల వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించే ప్రయత్నం చేస్తోందని మహతో పేర్కొన్నారు. పరీక్షా వ్యవస్థలో అవినీతిని నిర్మూలించే చర్యలకు విద్యార్థులు సహకరిస్తారని తెలిపారు. అయితే భవిష్యత్‌లో మళ్లీ పేపర్ లీకులు, నియామక అక్రమాలు జరగకుండా శాశ్వత పరిష్కారం చూపే వ్యవస్థ కావాలని ఆయన స్పష్టం చేశారు.

### సీబీఐ డిమాండ్‌తో పోరు ఇంకా మిగిలే

మహతో దీక్ష విరమించినా విద్యార్థుల అసలు డిమాండ్ పూర్తిగా నెరవేరలేదు. సీబీఐతో సమగ్ర విచారణ జరపాలన్న డిమాండ్‌పై విద్యార్థులు ఇంకా పట్టుబడుతున్నారు. గతంలో సీబీఐ, సీఐడీ విచారణలకు ఆదేశించినా అవి మధ్యలోనే ఆగిపోయిన సందర్భాలు ఉన్నాయని మహతో గుర్తుచేశారు. అందుకే కేవలం దర్యాప్తు ప్రకటన కాకుండా, పరీక్షా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రభుత్వం పరీక్షలు రద్దు చేసి విచారణకు సిద్ధమైనా సీబీఐ విచారణపై స్పష్టత వచ్చే వరకు విద్యార్థుల పోరాటం పూర్తిగా ముగిసినట్లు చెప్పలేని పరిస్థితి కొనసాగుతోంది.




# అయ్యయ్యో.. వద్దమ్మా..!

## • మండలిలో దద్దమ్మ.. దండయాత్ర •

ఏపీ రాజకీయాలు అసెంబ్లీ గోడలు దాటి శాసన మండలినీ వేడెక్కిస్తున్నాయి. ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన పెద్దల సభలో వ్యక్తిగత వ్యాఖ్యలు, పరుష పదజాలం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. మెగా డీఎస్సీ అంశంపై వైసీపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని మండలి చైర్మన్ మోషెన్ రాజు తిరస్కరించడంతో చర్చకు పట్టుబట్టిన వైసీపీ సభ్యులపై వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు ఒక్కసారిగా సభను వేడెక్కించాయి. మండలిలో వైసీపీ పక్ష నాయకుడు బొత్స సత్యనారాయణను ఉద్దేశించి 'దద్దమ్మ' అంటూ చేసిన వ్యాఖ్య రాజకీయ దుమారానికి దారితీసింది. విద్యాశాఖ మంత్రిగా ఉండి తమ నాయకుడికి చెప్పి కనీసం డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేకపోయారంటూ అచ్చెన్న చేసిన విమర్శ సభా చర్చను అసలు అంశం నుంచి వ్యక్తిగత విమర్శల వైపు మళ్లించింది. (వివరాలు 5లో..)

# పోలీసు కారులో గంజాయి రవాణా

## వ్యవస్థల పతనమంటూ జగన్ ఫైర్



ప్రకాశం జిల్లా అద్దంకి మండలం శంఖవరప్పాడు వద్ద జరిగిన ఘటనపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ తీవ్రస్థాయిలో స్పందించారు. అక్రమ మద్యం, గంజాయి రవాణాను అడ్డుకోవాల్సిన పోలీసుల వాహనంలోనే గంజాయి, మద్యం బాటిళ్లు కనిపించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ఆయన వ్యాఖ్యానించారు. ఇద్దరు ఎస్సైలు ప్రయాణిస్తున్న కారు ఓ ఆటోను ఢీకొనడం, ప్రమాదంలో ఆటోలోని వ్యక్తులు గాయపడటం తర్వాత అసలు విషయం వెలుగులోకి వచ్చిందని జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. కారు డిక్కీలో గంజాయి, మద్యం, పోలీస్ యూనిఫాం కనిపించాయని ఆరోపించారు. ఈ ఘటనను ఒక్క ప్రమాదంగా చూడలేమని, పోలీసు వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు పెంచే పరిణామమని జగన్ అభిప్రాయపడ్డారు. (5లో..)




# మార్కాపురం పేరులో చంద్రన్న ముద్ర?

- » జిల్లా పేరుపై ఎమ్మెల్యే సంచలన ప్రతిపాదన
- » చిరకాల కల నెరవేరిన వేళ కొత్త డిమాండ్

పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ప్రత్యేక జిల్లా ఏర్పాటు పూర్తయిన నేపథ్యంలో ఇప్పుడు మార్కాపురం జిల్లా పేరును మార్చాలన్న ప్రతిపాదన రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. మార్కాపురం జిల్లాకు "చంద్రన్న మార్కాపురం"గా పేరు పెట్టాలని స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరుతున్నారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వినతిపత్రం అందించారు. జిల్లా పేరును మార్చుతూ శాసనసభలో తీర్మానం చేయాలని స్పీకర్‌ను కోరారు. ఇది కేవలం ఎమ్మెల్యే వ్యక్తిగత అభిప్రాయం కాదని, మార్కాపురం ప్రాంత ప్రజల కోరికగా ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. (వివరాలు 3లో..)





# బీజేపీలో ఏపీకి కీలక పదవులు

- **చిన్నమ్మకు ఉపాధ్యక్ష హోదా**
- **విష్ణువర్ధన్‌కి నేషనల్ బెర్తులు**

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సోమవారం పార్టీ జాతీయ కార్యవర్గంలో కీలక మార్పులు చేపట్టారు. కొత్త జాతీయ ఆఫీస్ బేరర్లను ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డి. పురందేశ్వరికి జాతీయ ఉపాధ్యక్ష పదవి కట్టబెట్టారు. రాజమహేంద్రవరం ఎంపీగా ఉన్న పురందేశ్వరికి పార్టీలో కీలక బాధ్యత దక్కడం ఏపీ బీజేపీకి ప్రాధాన్యతగా మారింది. సీనియర్ నేత రామ్ మాధవ్‌కు కూడా జాతీయ ఉపాధ్యక్ష పదవి దక్కింది. దీంతో కొత్త టీమ్‌లో ఏపీకి ప్రాతినిధ్యం మరింత బలపడింది.

### విష్ణువర్ధన్ రెడ్డికి కీలక బాధ్యత

ఏపీకి చెందిన మరో నేత ఎస్. విష్ణువర్ధన్ రెడ్డికి ఆల్ సెల్స్ జాయింట్ కోఆర్డినేటర్ బాధ్యత లభించింది. శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన ఆయన 1992లో ప్రజా జీవితంలోకి ప్రవేశించారు. ఏబీవీపీ, బీజేవైఎం, బీజేపీలో వివిధ బాధ్యతలు నిర్వహించారు. ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేశారు. పార్టీ కోసం సుదీర్ఘకాలం పనిచేసిన ఆయనకు జాతీయ స్థాయిలో బాధ్యత అప్పగించడం ద్వారా పార్టీ నాయకత్వం ఆయన సేవలను గుర్తించిందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

### ఏపీపై బీజేపీ ప్రత్యేక ఫోకస్

ఒకే సమయంలో పురందేశ్వరికి జాతీయ ఉపాధ్యక్ష పదవి, విష్ణువర్ధన్ రెడ్డికి జాతీయ సంస్థాగత బాధ్యత రావడం ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడం, వివిధ సామాజిక వర్గాలు, అనుబంధ విభాగాలను సమన్వయం చేయడంలో ఈ నియామకాలు ఉపయోగపడే అవకాశం ఉంది. ముఖ్యంగా జాతీయ స్థాయిలో ఏపీ నేతలకు ప్రాధాన్యం పెరగడం పార్టీ భవిష్యత్ వ్యూహంలో రాష్ట్రానికి ఉన్న ప్రాధాన్యతను సూచిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# జార్ఖండ్ విద్యార్థుల సెగ

- **సోరెన్‌కు రాహుల్ లేఖ**
- **నిరసనకారులను కలవండి**
- **సమస్య పరిష్కరించాలని హితవు**



జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విద్యార్థుల ఆందోళన కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలకంగా స్పందించారు. తన రాజకీయ మిత్రుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను స్వయంగా నిరసన చేస్తున్న విద్యార్థులను కలవాలని కోరారు. ఆగస్టు 14న సోరెన్‌కు రాసిన లేఖలో విద్యార్థుల ఆందోళన 24వ రోజుకు చేరిందని, వారి నిరసన శాంతియుతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. విద్యార్థుల డిమాండ్లు న్యాయమైనవేనని రాహుల్ అభిప్రాయపడ్డారు. ప్రశాంతంగా నిరసన తెలిపే హక్కు ప్రజాస్వామ్యానికి కీలకమైన అంశమని ఆయన స్పష్టం చేశారు. జార్ఖండ్ ప్రభుత్వం విద్యార్థులతో చర్చలు ప్రారంభించడాన్ని స్వాగతించిన రాహుల్.. కొన్ని డిమాండ్లపై ప్రభుత్వం, విద్యార్థుల మధ్య ఇప్పటికే అంగీకారం వచ్చినట్లు పేర్కొన్నారు. అయినా ఆందోళన కొనసాగడం, కొందరు విద్యార్థులు నిరవధిక నిరాహార దీక్ష చేయడం ఆందోళనకరమని తెలిపారు.

### పరీక్షల రద్దు.. స్వతంత్ర దర్యాప్తు డిమాండ్

రాంచీలోని జైపాల్ సింగ్ స్టేడియం వద్ద జూలై 29 నుంచి వేలాది మంది ఉద్యోగ ఆశావహులు నిరసన చేస్తున్నారు. 14వ జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ పరీక్ష, JSSCCGL సహా పలు నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. పరీక్షల్లో సీట్లు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు విక్రయించారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా 14వ JPSC సివిల్ సర్వీసెస్ పరీక్షను రద్దు చేసి CBIతో దర్యాప్తు చేయాలని లేదా రాష్ట్రానికి వెలుపల ఉన్న రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పరీక్షల అక్రమాలు అర్హత ఉన్న అభ్యర్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని, నియామక వ్యవస్థపై నమ్మకాన్ని తగ్గిస్తున్నాయని వారు అంటున్నారు. జూలై 25 నుంచి 27 వరకు జరగాల్సిన JPSC కంబైన్డ్ సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షను కూడా "అనివార్య పరిస్థితుల" కారణంగా వాయిదా వేశారు.

### మిత్రుడికి రాహుల్ గట్టి సందేశం

విద్యార్థుల సమస్యపై రాహుల్ నేరుగా సోరెన్‌కు లేఖ రాయడం రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యమంత్రి స్వయంగా విద్యార్థుల ప్రతినిధులను కలిస్తే ప్రభుత్వం సమస్య పరిష్కారంపై ఉన్న నిబద్ధత మరింత స్పష్టమవుతుందని రాహుల్ పేర్కొన్నారు. మరోవైపు నిరసనకారులు మాత్రం రాహుల్‌కు తమ అసంతృప్తిని వెల్లడించారు. సోరెన్ మాట వినకపోతే జార్ఖండ్ ముక్తి మోర్చా నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి కాంగ్రెస్ ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకోవాలని కోరారు. రాహుల్ మద్దతు ప్రకటించినా ఇప్పటివరకు కాంక్రీట్ చర్య కనిపించలేదని వారు విమర్శించారు. హేమంత్ సోరెన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 20న ఆయన నివాసాన్ని ముట్టడిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో మిత్రపక్ష ప్రభుత్వంపై రాహుల్ ఒత్తిడి పెంచారా? విద్యార్థుల ఆందోళనకు సీఎం నేరుగా పరిష్కారం చూపుతారా? అన్నది ఇప్పుడు జార్ఖండ్ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# పోలీసు కారులో గంజాయి రవాణా

- **వ్యవస్థల పతనమంటూ జగన్ ఫైర్**



ప్రకాశం జిల్లా అద్దంకి మండలం శంఖవరప్పాడు వద్ద జరిగిన ఘటనపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ తీవ్రస్థాయిలో స్పందించారు. అక్రమ మద్యం, గంజాయి రవాణాను అడ్డుకోవాల్సిన పోలీసుల వాహనంలోనే గంజాయి, మద్యం బాటిళ్లు కనిపించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ఆయన వ్యాఖ్యానించారు. ఇద్దరు ఎస్సైలు ప్రయాణిస్తున్న కారు ఓ ఆటోను ఢీకొనడం, ప్రమాదంలో ఆటోలోని వ్యక్తులు గాయపడటం తర్వాత అసలు విషయం వెలుగులోకి వచ్చిందని జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. కారు డిక్కీలో గంజాయి, మద్యం, పోలీస్ యూనిఫాం కనిపించాయని ఆరోపించారు. ఈ ఘటనను ఒక్క ప్రమాదంగా చూడలేమని, పోలీసు వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు పెంచే పరిణామమని జగన్ అభిప్రాయపడ్డారు.

### వీడియో తీస్తే కేసులా?


ఘటన తర్వాత అక్కడికి చేరుకున్న ప్రజలు వీడియోలు తీసి విషయాన్ని బయటకు తీసుకురావడానికి ప్రయత్నించారని జగన్ పేర్కొన్నారు. అయితే వీడియోలు తీయొద్దని, కేసులు పెడతామని మరో సీఐ అక్కడి వారిని హెచ్చరించారని ఆయన ఆరోపించారు. నిజాన్ని రికార్డు చేయడమే నేరమా? ప్రశ్నించడం తప్పా? అంటూ జగన్ ప్రశ్నించారు. ఇద్దరు పోలీసు అధికారులు మద్యం మత్తులో ఉన్నారన్న ఆరోపణలు కూడా ట్వీట్‌లో ప్రస్తావించారు. అంతేకాదు, ఆ ఇద్దరు అధికారులు ప్రైవేటు పార్టీలు నిర్వహించారని, అక్కడ మద్యం, గంజాయి వినియోగించారని, ఆ పార్టీలకు కొందరు టీడీపీ నేతలు హాజరయ్యారన్న సమాచారం ఉందని జగన్ ఆరోపించారు. ప్రమాదం తర్వాత స్థానిక టీడీపీ నాయకులు పోలీసులను అక్కడి నుంచి తప్పించారన్న ఆరోపణలను కూడా ప్రస్తావిస్తూ పోలీసు వ్యవస్థకు రాజకీయ సంబంధాలు ఉంటే నిష్పక్షపాత దర్యాప్తుపై ప్రజలకు ఎలా నమ్మకం కలుగుతుందని ప్రశ్నించారు.

### వ్యవస్థపై జగన్ గురి

చంద్రబాబు ప్రభుత్వంపై జగన్ తన ట్వీట్‌లో తీవ్ర విమర్శలు చేశారు. గత రెండేళ్లుగా వ్యవస్థలను ప్రజల కోసం కాకుండా రాజకీయ కక్షసాధింపులు, ప్రత్యర్థుల గొంతు నొక్కడం, అధికార పార్టీ ప్రయోజనాలకు ఉపయోగించారని ఆరోపించారు. పోలీసు వ్యవస్థలో జరిగినట్టు చెబుతున్న ఈ ఘటన దాని ఫలితమేనని విమర్శించారు. ఘటనను మీడియా బలంతో కప్పిపుచ్చకుండా నిష్పక్షపాత విచారణ జరిపి, తప్పు చేసినవారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబును డిమాండ్ చేశారు.

# ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి

- **డీఎస్సీ నియామకాలపై కుట్రలా?**
- **డీవియేషన్ ఎక్కడ జరిగింది?**
- **వైసీపీ తీరుపై చంద్రబాబు ఆగ్రహం**



మెగా డీఎస్సీ నియామకాలపై వస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీ వేదికగా గట్టి కౌంటర్ ఇచ్చారు. నియామక ప్రక్రియలో ఎక్కడా డీవియేషన్ జరగలేదని, మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్‌లోనే నిర్వహించామని స్పష్టం చేశారు. 15,941 ఉపాధ్యాయ పోస్టులను కేవలం 148 రోజుల్లో పారదర్శకంగా భర్తీ చేశామని తెలిపారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ల నుంచి రిజర్వేషన్లు, పరీక్షలు, ఫలితాల వరకు ప్రతి దశలో నిబంధనలు పాటించామని చెప్పారు. 13 సబ్జెక్టుల్లో 42 వేల ప్రశ్నలను సిద్ధం చేసి, 154 కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించామని వివరించారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే ఎంపికలు జరిగాయని చంద్రబాబు స్పష్టం చేశారు.

### వైసీపీకి అసెంబ్లీ సవాల్

డీఎస్సీపై వైసీపీ చేస్తున్న విమర్శలను చంద్రబాబు తీవ్రంగా తప్పుబట్టారు. రోడ్డుపై హిట్ అండ్ రన్ తరహాలో ఆరోపణలు చేయడం కాకుండా ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ విసిరారు. రెండున్నరేళ్లుగా అసెంబ్లీకి రాని పార్టీని తన రాజకీయ జీవితంలో చూడలేదని వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి రాకుండా బయట నిరసనలు చేయడం, జీతాలు, ప్రివిలేజీలు తీసుకోవడంపై ప్రశ్నలు సంధించారు. డీఎస్సీ నియామకాలపై కుట్రలు పనిచేయవని ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు భరోసా ఇచ్చారు. ఒడిశా కూలీలు, 90 ఏళ్ల జగన్ జెన్జీలతో ఫేక్ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ వైసీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.

### విద్య రంగంపై టీడీపీ మార్క్

విద్యారంగంలో తమ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను కూడా చంద్రబాబు వివరించారు. 2019-24 మధ్య ఉపాధ్యాయ నియామకాలు చేపట్టలేదని విమర్శించారు. టీడీపీ, ఎన్డీయే హయాంలో ఇప్పటివరకు 14 డీఎస్సీల్లో 11 డీఎస్సీల ద్వారా నియామకాలు చేపట్టామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తల్లికి వందనం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి దూరమైన విద్యార్థుల్లో లక్ష మందికిపైగా తిరిగి ప్రభుత్వ బడులకు వచ్చారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పోటీ పరీక్షలకు శిక్షణ, ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత వంటి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. డీఎస్సీపై ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కుట్రలు చేసే పార్టీలకు కాకుండా ప్రజలకు తమ ప్రభుత్వం జవాబుదారీగా ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు.

# పారదర్శకతే మా ఆయుధం

- **148 రోజుల్లో నియామకాలు**
- **డీఎస్సీపై లోకేశ్ ఫుల్ క్లారిటీ!**



మెగా డీఎస్సీ నిర్వహణపై వస్తున్న విమర్శలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో ఘాటుగా సమాధానం ఇచ్చారు. డీఎస్సీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించామని స్పష్టం చేశారు. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించగా, 3,36,300 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మొత్తం నియామక ప్రక్రియను కేవలం 148 రోజుల్లో పూర్తి చేశామని చెప్పారు. టెట్‌ను తప్పనిసరి చేయడం, వర్టికల్ రిజర్వేషన్లు, హారిజంటల్ రిజర్వేషన్లు అమలు చేయడం, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పకడ్బందీగా నిర్వహించడం ద్వారా ఎంపికలు చేపట్టామని వివరించారు. పరీక్షను టీసీఎస్ ఐయాన్ ప్లాట్‌ఫామ్ ద్వారా నిర్వహించినట్లు తెలిపారు.

### 42 వేల ప్రశ్నలు.. 336 కేసులు

డీఎస్సీ కోసం 42 వేల ప్రశ్నలను సిద్ధం చేశామని, అభ్యర్థుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు పలు స్థాయిల్లో గ్రీవెన్స్ వ్యవస్థ ఏర్పాటు చేశామని లోకేశ్ చెప్పారు. నియామకాలపై భిన్నాభిప్రాయాలతో 336 కేసులు దాఖలైనా, న్యాయపరమైన అంశాలను ఎదుర్కొంటూ ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పూర్తయిన తర్వాత ఉపకులాలను రోస్టర్‌లో సర్దుబాటు చేసి డీఎస్సీ నిర్వహించామని చెప్పారు. స్పోర్ట్స్ కోటాను కూడా కేంద్ర నిబంధనలకు అనుగుణంగా 29 కేటగిరీల నుంచి 65 కేటగిరీలకు పెంచామని వివరించారు. గత ప్రభుత్వం 2019-24 మధ్య ఒక్క ఉపాధ్యాయ నియామకం కూడా చేపట్టలేదని విమర్శించిన లోకేశ్.. టీడీపీ హయాంలో ఇప్పటివరకు 1.80 లక్షల మంది టీచర్లను నియమించామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు సింగపూర్, ఫిన్లాండ్‌లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

### ఏటా డీఎస్సీ.. వైసీపీకి సవాల్

ఇకపై ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహిస్తామని లోకేశ్ ప్రకటించారు. డీఎస్సీపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారని వైసీపీపై మండిపడ్డారు. ఆరోపణలు నిజమైతే ఆధారాలు చూపించాలని సవాల్ చేశారు. సభలో అయినా.. సభ బయట అయినా చర్చకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. జగన్ సభకు ఎందుకు రావడం లేదని ప్రశ్నిస్తూ, తేదీ, సమయం ఖరారు చేస్తే చర్చకు సిద్ధమని అన్నారు. డీఎస్సీ అంటే తెలియని వారే నియామకాలపై మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు అందరికీ ఉందని చెబుతూనే, నియామక ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ప్రభుత్వం చెబుతున్న వాదనను లోకేశ్ మరోసారి బలంగా వినిపించారు. ఉపాధ్యాయ నియామకాల్లో పారదర్శకతను కొనసాగిస్తూ, విద్యా వ్యవస్థలో మరిన్ని సంస్కరణలు తీసుకువస్తామని స్పష్టం చేశారు.

# సంధ్య థియేటర్ కేసులో కీలక విచారణ



హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణకు ప్రముఖ హీరో అల్లు అర్జున్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. గతంలో సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసుకు సంబంధించి కోర్టులో పలు అంశాలపై విచారణ కొనసాగుతోంది. తాజా విచారణ సందర్భంగా అల్లు అర్జున్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజరయ్యారు. కేసు తదుపరి విచారణను నాంపల్లి కోర్టు సెప్టెంబర్ 1కి వాయిదా వేసింది. దీంతో తదుపరి విచారణలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఘటనకు సంబంధించిన కేసు విచారణ ప్రస్తుతం న్యాయస్థానంలో కొనసాగుతుండటంతో, తదుపరి విచారణపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

# అయ్యయ్యో.. వద్దమ్మా..!

- మండలిలో దద్దమ్మ.. దండయాత్ర




ఏపీ రాజకీయాలు అసెంబ్లీ గోడలు దాటి శాసన మండలినీ వేడెక్కిస్తున్నాయి. ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన పెద్దల సభలో వ్యక్తిగత వ్యాఖ్యలు, పరుష పదజాలం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. మెగా డీఎస్సీ అంశంపై వైసీపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని మండలి చైర్మన్ మోషేన్ రాజు తిరస్కరించడంతో చర్చకు పట్టుబట్టిన వైసీపీ సభ్యులపై వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు ఒక్కసారిగా సభను వేడెక్కించాయి. మండలిలో వైసీపీ పక్ష నాయకుడు బొత్స సత్యనారాయణను ఉద్దేశించి 'దద్దమ్మ' అంటూ చేసిన వ్యాఖ్య రాజకీయ దుమారానికి దారితీసింది. విద్యాశాఖ మంత్రిగా ఉండి తమ నాయకుడికి చెప్పి కనీసం డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేకపోయారంటూ అచ్చెన్న చేసిన విమర్శ సభా చర్చను అసలు అంశం నుంచి వ్యక్తిగత విమర్శల వైపు మళ్లించింది.

### చీపురుపల్లి మోత


అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై బొత్స సత్యనారాయణ కూడా ఘాటుగానే స్పందించారు. మనిషి ఎదగడం, పెరగడం మాత్రమే కాదని.. మాట తీరు కూడా బాగుండాలని హితవు పలికారు. ఎవరు దద్దమ్మో, ఎవరు ఆంబోతో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలు, ప్రజల ఇబ్బందులపై దృష్టి పెట్టాల్సిన సమయంలో ఇలాంటి పదజాలంతో చర్చను పక్కదారి పట్టించడం సమంజసం కాదనే సంకేతం ఇచ్చారు. అచ్చెన్న వ్యాఖ్యలను మండలి చైర్మన్ పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని బొత్స కోరారు. అయితే వివాదం ఇంతటితో ఆగలేదు. 'దద్దమ్మ' అనేది అన్‌పార్లమెంటీనా? అంటూ అచ్చెన్నాయుడు మరోసారి ప్రశ్నించడం, క్షమాపణ చెప్పమంటే చెబుతానని చెప్పడం మరింత చర్చకు దారితీసింది. దీంతో మండలిలో అసలు చర్చ ఏ అంశంపై జరగాల్సిందో అన్న ప్రశ్నే తెరపైకి వచ్చింది.

### ప్రజలు అన్నీ గమనిస్తున్నారు!

శాసన మండలి అంటే రాజకీయ వాగ్వాదాలకు వేదిక మాత్రమే కాదు.. అనుభవం, విజ్ఞత, హుందాతనానికి ప్రతీకగా నిలవాల్సిన సభ. అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా ప్రజా సమస్యలను ప్రస్తావించడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, సమాధానాలు రాబట్టడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమే. కానీ చర్చల స్థానంలో చురకలు, వాదనల స్థానంలో వ్యక్తిగత విమర్శలు, సమస్యల స్థానంలో పరుష పదజాలం ముందుకొస్తే ప్రజల్లో సభల పట్ల ఉన్న గౌరవం దెబ్బతినే ప్రమాదం ఉంది. డీఎస్సీ వంటి యువత భవిష్యత్తుతో ముడిపడిన అంశంపై చర్చ జరగాల్సిన వేళ 'దద్దమ్మ' అనే ఒక్క పదమే మొత్తం సభా సమయాన్ని ఆక్రమించడం దురదృష్టకరం. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలకు హద్దులుండాలి. సభా మర్యాదలకు మరింత విలువ ఉండాలి. లేకపోతే ప్రజల సమస్యల కోసం ఉన్న 'పెద్దల సభ'.. రాజకీయ రచ్చకు 'పెద్ద వేదిక'గా మారే ప్రమాదం ఉంటుంది.

# కోర్టు గడప తొక్కిన భార్య

- **వేధింపులకు కోర్టు పిడుగు..!**
- **కాలయాపన చేస్తే ఇక భారీ మూల్యం**




ఒకప్పుడు పెళ్లి పందిరిలో మొదలైన బంధం.. కాలం గడిచేకొద్దీ కష్టాల కడలిగా మారింది. మాటలు మంటలయ్యాయి.. కలిసి జీవించాల్సిన జీవితం నరకప్రాయంగా మారిందన్న ఆరోపణలు వచ్చాయి. చివరకు భర్తతో కలిసి ఉండలేనంటూ భార్య కోర్టు గడప తొక్కింది. విడాకుల కోసం వేసిన అడుగులు.. మూడేళ్ల న్యాయపోరాటంగా మారాయి. ఒకవైపు విడాకులు కావాలంటున్న భార్య.. మరోవైపు కాపురానికి పంపించాలంటున్న భర్త. మధ్యలో లోక్ అదాలత్ రాజీ.. ఆ తర్వాత మళ్లీ హైకోర్టు మెట్లు. కేసు ముగుస్తుందనుకున్న ప్రతిసారీ మరో మలుపు తిరిగింది. కానీ ఈసారి కోర్టు మాత్రం గట్టిగా స్పందించింది. న్యాయ ప్రక్రియను సాగదీస్తే చూస్తూ ఊరుకోబోమని తీర్పుతో స్పష్టం చేసింది. విడాకులు మంజూరు చేయడమే కాదు.. భార్యకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. కుటుంబ వివాదం చివరకు న్యాయస్థానంలో ముగిసినా.. ఈ తీర్పు మాత్రం వేధింపులకు, కాలయాపనకు గట్టి హెచ్చరికగా మారింది.

వివాహ బంధంలో మొదలైన విభేదాలు చివరకు న్యాయస్థానం మెట్లు ఎక్కించాయి. తెనాలి పరిధిలోని ఈ కుటుంబ వివాదంలో భార్యను మానసికంగా, శారీరకంగా వేధించడంతోపాటు ప్రాణహాని ఉందని ఆరోపణలు వచ్చాయి. దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన నాగ సౌజన్యకు 2016 ఏప్రిల్ 22న పొన్నూరు మండలం దొప్పలపూడికి చెందిన యలవర్తి నాగబ్రహ్మంతో వివాహమైంది. కొంతకాలానికి పరిస్థితులు విషమించడంతో కలిసి జీవించడం సాధ్యం కాదంటూ సౌజన్య 2023లో తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించారు. విడాకులు కోరిన ఆమెకు న్యాయం కోసం సుదీర్ఘ పోరాటం తప్పలేదు.

### రాజీ తర్వాత మళ్లీ వివాదం

భార్య విడాకులు కోరగా.. భర్త మాత్రం ఆమెను తిరిగి కాపురానికి పంపాలని 2024లో పిటిషన్ వేశారు. కేసులు నడుస్తున్న సమయంలో లోక్‌అదాలత్‌లో రాజీకి వెళ్లి విడాకులు పొందేందుకు అనుమతులు కూడా తీసుకున్నారు. కానీ తర్వాత నాగబ్రహ్మం హైకోర్టును ఆశ్రయించి, తనతో హడావుడిగా సంతకాలు చేయించుకున్నారని, లోక్‌అదాలత్ రాజీని రద్దు చేయాలని కోరారు. తెనాలి కోర్టు విచారణపై స్టే ఇవ్వాలన్న అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. దీంతో రెండు కేసులను కలిపి విచారించిన తెనాలి కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. భార్య విడాకుల పిటిషన్‌ను అనుమతించి.. భర్త కాపురానికి పంపాలన్న పిటిషన్‌ను కొట్టివేసింది.

### కాలయాపనకు లక్ష రూపాయల షాక్

ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. భార్యపై మానసిక వేధింపుల ఆరోపణలు రావడం మాత్రమే కాకుండా, న్యాయ ప్రక్రియను సాగదీస్తూ కోర్టు విలువైన సమయాన్ని వృథా చేసిన తీరును న్యాయమూర్తి ఎస్. వెంకటేశ్వరరెడ్డి తీవ్రంగా పరిగణించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న వెలువడిన తీర్పులో నాగ సౌజన్యకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని నాగబ్రహ్మంను ఆదేశించారు. ఈ తీర్పు కేవలం ఒక కుటుంబ వివాదానికి ముగింపు కాదు.. కోర్టు ప్రక్రియను కావాలనే ఆలస్యం చేస్తే దాని ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో చెప్పే హెచ్చరికగా నిలిచింది. వేధింపులు, న్యాయ కాలయాపనకు ఇక మూల్యం చెల్లించాల్సిందే అన్న బలమైన సందేశాన్ని ఈ తీర్పు ఇచ్చింది.

# లక్ష కోట్లు ఎవరివి.. ఎక్కడున్నాయి?

- **మర్చిపోయిన డబ్బుపై మళ్లీ ఫోకస్**
- **బ్యాంకుల్లో మూలిగిపోతున్న సొమ్ము**

ఒకప్పుడు బ్యాంకు ఖాతాలో వేసిన పైసలు.. కాలం గడిచేకొద్దీ ఎవరి జ్ఞాపకాల్లోనూ లేకుండా పోయాయి. చేతిలో ఉన్నప్పుడు చిన్న సొమ్ముల్లా కనిపించిన డబ్బే.. ఏళ్ల తర్వాత లక్షలు, కోట్లుగా మారింది. ఖాతాదారు లేరు.. వారసులకు సమాచారం లేదు.. పాత పాస్‌బుక్ మూలన పడిపోయింది. ఫోన్ నంబర్ మారిపోయింది.. చిరునామా మారిపోయింది. కానీ బ్యాంకులో ఉన్న సొమ్ము మాత్రం అక్కడే ఉంది. అలా దేశవ్యాప్తంగా మర్చిపోయిన ఖాతాలు పెరిగిపోతూ.. చివరకు దాదాపు రూ.లక్ష కోట్ల డిపాజిట్లు ఆర్బీఐకి చేరాయి. ఈ సొమ్ము ఎవరిది? ఏ కుటుంబానికి చెందింది? ఎప్పుడో దాచిన పైసలు ఇప్పుడు ఎక్కడున్నాయి? అనే ప్రశ్నలు ఇప్పుడు ఆసక్తిని రేపుతున్నాయి. ముఖ్యంగా ఇంట్లో పెద్దలు చనిపోయిన తర్వాత వారి బ్యాంకు ఖాతాల గురించి పట్టించుకోని కుటుంబాలు ఒక్కసారి ఆలోచించాల్సిన సమయం వచ్చింది. మీ తాత దాచిన సొమ్మా? మీ నాన్న మరిచిపోయిన డబ్బా? లేక మీ పేరుతోనే ఉన్న పాత ఖాతానా? సమాధానం తెలుసుకోవడానికి ఆర్బీఐ తీసుకొచ్చిన ఉద్గామ్ పోర్టల్ ఇప్పుడు కీలక మార్గంగా మారింది.

బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి తర్వాత వాటిని పట్టించుకోని వారు ఎందరో. ఖాతాదారులు చనిపోవడం, వారసులకు సమాచారం లేకపోవడం, పాత ఫోన్ నంబర్లు, మారిపోయిన చిరునామాలు వంటి కారణాలతో భారీ మొత్తంలో డిపాజిట్లు క్లెయిమ్ కాకుండా మిగిలిపోతున్నాయి. తాజా ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఆర్బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (డీఈఏ) ఫండ్‌కు దాదాపు రూ.లక్ష కోట్ల మేర డిపాజిట్లు బదిలీ అయ్యాయి. 2026 జనవరి 31 నాటికి ఈ మొత్తం రూ.98,073 కోట్లుగా ఉంది. అంటే ఈ డబ్బు ఎవరిదో.. అసలు ఖాతాదారులు, వారి కుటుంబాలకు కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

### డబ్బు ఆర్బీఐ వద్దకు వెళ్లిందంటే పోయినట్టేనా?




ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. బ్యాంకు నుంచి ఆర్బీఐ, డీఈఏ ఫండ్‌కు డబ్బు బదిలీ అయినంత మాత్రాన ఖాతాదారుడి హక్కు పోదు. ఖాతాదారు, నామినీ లేదా చట్టబద్ధమైన వారసులు సరైన ఆధారాలు సమర్పించి తమ డబ్బును తిరిగి పొందవచ్చు. సాధారణంగా రెండేళ్లకు పైగా ఖాతాదారు స్వయంగా లావాదేవీలు చేయకపోతే ఖాతా ఇన్‌ఆపరేటివ్‌గా మారుతుంది. పదేళ్లపాటు డబ్బు క్లెయిమ్ కాకపోతే అది డీఈఏ ఫండ్‌కు బదిలీ అవుతుంది. కుటుంబ సభ్యులు చనిపోయిన వారి పాత బ్యాంకు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయేమో ఒకసారి తప్పక పరిశీలించాల్సిన అవసరం ఇక్కడే ఉంది.

### మీ డబ్బు ఉందో ఇలా తెలుసుకోండి

మీ పేరు మీద లేదా కుటుంబ సభ్యుల పేరుతో మర్చిపోయిన డిపాజిట్ ఉందేమో తెలుసుకోవడానికి ఆర్బీఐ ఉద్గామ్ పోర్టల్ ఉపయోగించవచ్చు. ఒకే ప్లాట్‌ఫామ్‌లో పలు బ్యాంకుల్లో ఉన్న అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వెతికే అవకాశం ఉంది. అయితే ఉద్గామ్‌లో డబ్బు కనిపించిందంటే అక్కడి నుంచే డబ్బు చేతికి రాదు. డిపాజిట్ ఉన్న బ్యాంకును సంప్రదించి క్లెయిమ్ ప్రక్రియ పూర్తి చేయాలి. నామినీ లేదా వారసులు అవసరమైన పత్రాలు సమర్పించాలి. ప్రభుత్వం నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమాల ద్వారా ఇప్పటికే రూ.5,777 కోట్ల విలువైన అన్‌క్లెయిమ్డ్ ఆస్తులను 22.95 లక్షల క్లెయిమ్‌లకు తిరిగి అందించారు. కాబట్టి "లక్ష కోట్లు ఎవరిస్తారు?" అనే ప్రశ్నకు సమాధానం.. ఆ డబ్బు బ్యాంకుల్లోనే ఉంది. మీ కుటుంబానికి చెందినదేమైనా అందులో ఉందేమో ఇప్పుడే చెక్ చేసుకోవడమే అసలు విషయం.



- జాతీయ కూర్పుపై రాష్ట్రంలో కొత్త చర్చ
- కొత్త టీమ్‌లో తెలంగాణ పేరే లేదు

# బీజేపీ టీమ్ లో తెలంగాణకు షాక్

• పొరుగు రాష్ట్రాల నుంచి సెలెక్ట్ • తెలంగాణ లీడర్స్ పేర్లు రిజెక్ట్ • జాతీయ పదవుల్లో ఎంప్టీ హ్యాండ్ • రాష్ట్ర వర్గానికి షాకిచ్చిన హై కమాండ్

**భారతీయ జనతా పార్టీ కొత్త జాతీయ కార్యవర్గ బృందాన్ని పార్టీ అధ్యక్షుడు నితిన్ నబీన్ సోమవారం ప్రకటించారు. ఈ పునర్వ్యవస్థీకరణలో 13 మంది జాతీయ ఉపాధ్యక్షులు, 8 మంది జాతీయ ప్రధాన కార్యదర్శులు, 16 మంది జాతీయ కార్యదర్శులు సహా కీలక బాధ్యతలను ప్రకటించారు. జాతీయ స్థాయిలో అనుభవం, యువత, ప్రాంతీయ సమతుల్యత, సామాజిక ప్రాతినిధ్యానికి ప్రాధాన్యత ఇచ్చామని పార్టీ ప్రకటించింది. అయితే ఈ జాబితాను పరిశీలిస్తే తెలంగాణ నుంచి ప్రధాన జాతీయ పదవుల్లో ఒక్క నాయకుడి పేరు కూడా కనిపించకపోవడం ఇప్పుడు రాజకీయ చర్చకు కారణమవుతోంది. జాతీయ ఉపాధ్యక్షుల జాబితాలో రాజస్థాన్‌కు వసుంధరా రాజే, ఉత్తరాఖండ్‌కు తీరథ్‌సింగ్ రావత్, కర్ణాటకకు ఎం. నాగరాజ, ఆంధ్రప్రదేశ్‌కు దగ్గుబాటి పురందేశ్వరి, ఉత్తరప్రదేశ్‌కు రేఖా వర్మ వంటి నేతలకు చోటు దక్కింది. జాతీయ ప్రధాన కార్యదర్శుల జాబితాలో మహారాష్ట్ర, ఢిల్లీ, త్రిపుర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, హర్యానా రాష్ట్రాలకు చెందిన నేతలు ఉన్నారు. జాతీయ కార్యదర్శుల జాబితాలో కేరళ, ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్, గుజరాత్, నాగాలాండ్, తమిళనాడు, పశ్చిమబెంగాల్, బీహార్, అసోం వంటి రాష్ట్రాలకు ప్రాతినిధ్యం లభించింది. కానీ తెలంగాణ పేరు మాత్రం ఈ ప్రధాన జాతీయ పదవుల్లో కనిపించలేదు. దీంతో తెలంగాణ బీజేపీలో సహజంగానే ఒక ప్రశ్న ముందుకు వస్తోంది. రాష్ట్రంలో పార్టీకి ఎంపీలు ఉన్నారు. ఎమ్మెల్యేలు ఉన్నారు. సీనియర్ నేతలు ఉన్నారు. గత కొన్నేళ్లలో తెలంగాణలో బీజేపీ తన ఓటు శాతాన్ని పెంచుకుంది. లోక్‌సభ స్థాయిలో కూడా పార్టీ తన ఉనికిని బలంగా చాటుకుంది. అలాంటి రాష్ట్రానికి జాతీయ సంస్థాగత బృందంలో ఒక్క కీలక పదవి కూడా ఎందుకు దక్కలేదు అన్నదే ఇప్పుడు అసలు చర్చ. ఇది కేవలం పదవి దక్కలేదనే అంశం కంటే ఎక్కువగా, తెలంగాణకు జాతీయ నాయకత్వం ఇచ్చే రాజకీయ ప్రాధాన్యత ఎంత? అనే ప్రశ్నను ముందుకు తెస్తోంది.**







### తెలంగాణ బలం.. జాతీయ గుర్తింపు ఎక్కడ?

తెలంగాణ బీజేపీ గత దశాబ్దంలో గణనీయంగా ఎదిగిన రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. ఒక దశలో రాష్ట్రంలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఉండగా, బీజేపీ మూడో శక్తిగా ఉన్న పరిస్థితి నుంచి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగడానికి ప్రయత్నించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తన సీట్ల సంఖ్యను పెంచుకుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా రాష్ట్రంలో పార్టీ బలమైన ప్రదర్శన చేసింది. ప్రస్తుతం తెలంగాణలో బీజేపీకి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్. రామచందర్ రావు నాయకత్వం వహిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో కొత్త జాతీయ టీమ్‌లో తెలంగాణ నేతకు చోటు దక్కుతుందని రాష్ట్ర పార్టీ వర్గాల్లో అంచనాలు ఉండటం సహజమే.

ముఖ్యంగా గతంలో జాతీయ స్థాయిలో తెలంగాణకు చెందిన బండి సంజయ్, డీకే అరుణ, కె. లక్ష్మణ్ వంటి నేతలకు వివిధ కీలక బాధ్యతలు లభించాయి. 2023లో బండి సంజయ్‌ను జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించినప్పుడు తెలంగాణకు కేంద్ర నాయకత్వం ప్రాధాన్యత ఇస్తోందనే సంకేతం వెళ్లింది. ఇప్పుడు కొత్త బృందంలో తెలంగాణ నుంచి అలాంటి ప్రతినిధిత్వం కనిపించకపోవడం ఆ గత పరిస్థితితో పోల్చి చూస్తున్నారు. అయితే దీనిని వెంటనే తెలంగాణపై బీజేపీ హైకమాండ్ వైఖరి మారిపోయిందని తేల్చేయడం సరైనది కాదు. ఎందుకంటే జాతీయ టీమ్ కూర్పు ఒక్క రాష్ట్ర రాజకీయ బలంపై మాత్రమే ఆధారపడదు. ఎన్నికల బాధ్యతలు, సంస్థాగత అనుభవం, ప్రాంతీయ సమీకరణాలు, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం, రాబోయే ఎన్నికల అవసరాలు వంటి అనేక అంశాలు ఇందులో పనిచేస్తాయి. కొత్త జాతీయ బృందంలో 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించినట్లు బీజేపీ వెల్లడించింది. పది మంది మహిళలకు, ఆరు మంది మైనారిటీ వర్గాలకు చెందిన నేతలకు చోటు కల్పించింది. ఈ నేపథ్యంలో తెలంగాణను ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టారనే నిర్ధారణకు ప్రస్తుతం ఆధారాలు లేవు. అయినా తెలంగాణకు ప్రాతినిధ్యం లేకపోవడం మాత్రం రాజకీయంగా గమనించదగ్గ పరిణామమే.

### • నబీన్ మాటలు.. కొత్త టీమ్ సంకేతాలు

ఇక్కడ మరో ఆసక్తికరమైన అంశం ఉంది. నితిన్ నబీన్ స్వయంగా తెలంగాణపై గతంలో చేసిన వ్యాఖ్యలను పరిశీలిస్తే, రాష్ట్రాన్ని తక్కువగా చూస్తున్నారనే భావనకు నేరుగా సరిపడే సంకేతాలు కనిపించవు. 2026 జూన్‌లో ఆయన తెలంగాణలో మూడు రోజుల పర్యటన చేశారు. జిల్లాల పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. బూత్ స్థాయి నాయకులతో సమావేశమయ్యారు. విద్యార్థులు, గిరిజన వర్గాలతో సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర పార్టీ కార్యవర్గంతో చర్చలు జరిపారు. తెలంగాణను బీజేపీకి "స్పెషల్ మిషన్"గా చూస్తున్నామని నబీన్ ప్రకటించారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లక్ష్యమని చెప్పారు. బెంగాల్ తరహాలో దీర్ఘకాలిక సంస్థాగత పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అంతేకాదు, తెలంగాణలో బీజేపీ గ్రామస్థాయి వరకు విస్తరించాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టంగా చెప్పారు. పలు జిల్లా కార్యాలయాల ప్రారంభం కూడా అదే వ్యూహంలో భాగంగా జరిగింది. అందువల్ల ఒకవైపు తెలంగాణను ప్రత్యేక మిషన్‌గా ప్రకటిస్తూ, మరోవైపు జాతీయ టీమ్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం పరస్పర విరుద్ధంగా కనిపిస్తున్నదన్న వాదనకు అవకాశం ఏర్పడింది. కానీ బీజేపీ సంస్థాగత వ్యూహాన్ని మరో కోణంలో చూస్తే దీనికి వేరే అర్థం కూడా ఉండొచ్చు. తెలంగాణలో ఇప్పటికే రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర స్థాయి సంస్థాగత వ్యవస్థ ఉన్నందున జాతీయ స్థాయి పదవుల కంటే రాష్ట్రంలోనే ప్రత్యక్ష ఎన్నికల బాధ్యతలను పెంచాలని కేంద్ర నాయకత్వం భావించి ఉండవచ్చు. తెలంగాణ మున్సిపల్ రాజకీయాలపై కూడా నబీన్ బాధ్యతలు కేటాయించిన విషయం ఉంది. కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే తెలంగాణ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల బాధ్యతలు కేటాయించడం కూడా రాష్ట్రంపై దృష్టి ఉందనే సంకేతంగా అప్పట్లో విశ్లేషణలు వచ్చాయి. కాబట్టి జాతీయ పదవి లేకపోవడం... తెలంగాణను లైట్ తీసుకోవడం అనే సమీకరణం ఇప్పుడే ఖరారు చేయలేం. అయితే రాష్ట్ర నాయకుల్లో ఆ అసంతృప్తి చర్చగా మారితే మాత్రం అది భవిష్యత్‌లో పార్టీ అంతర్గత రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

### • పొరుగు రాష్ట్రానికి పదవి.. తెలంగాణకు ఎందుకు కాదు?

ఈ జాబితాలో తెలంగాణతో పోల్చి చూడాల్సిన మరో అంశం ఆంధ్రప్రదేశ్‌కు దక్కిన ప్రాతినిధ్యం. జాతీయ ఉపాధ్యక్షురాలిగా డి. పురందేశ్వరికి చోటు లభించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాయకురాలికి జాతీయ స్థాయిలో కీలక పదవి రావడం సహజంగానే తెలంగాణ రాజకీయ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది. అలాగే తమిళనాడు, కేరళ, కర్ణాటక, పశ్చిమబెంగాల్, అసోం వంటి రాష్ట్రాలకు కూడా జాతీయ బృందంలో ప్రాతినిధ్యం లభించింది. దక్షిణ భారతంలో తెలంగాణ మినహా ఇతర కీలక రాష్ట్రాలకు కనిపించే స్థాయి ప్రాతినిధ్యం ఉండటం ఈ చర్చకు మరింత బలం ఇస్తోంది. అయితే ఒక విషయం గుర్తించాలి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం రావడం తెలంగాణకు వ్యతిరేక నిర్ణయం అని చెప్పలేం. బీజేపీ ప్రతి రాష్ట్రానికి ఒకే సంఖ్యలో పదవులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఆయా రాష్ట్రాల్లో నాయకుల అనుభవం, ఎన్నికల అవసరం, సామాజిక సమీకరణాలు, భవిష్యత్ విస్తరణ లక్ష్యాలు వంటి అంశాల ఆధారంగా కూర్పు మారుతుంది. కొత్త బృందంలో పార్టీ 10 మంది మహిళలకు అవకాశం ఇవ్వడం, మైనారిటీ వర్గాలకు చెందిన ఆరుగురికి చోటు కల్పించడం, ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విస్తృత సామాజిక, ప్రాంతీయ సమతుల్యత సాధించే ప్రయత్నం చేసింది. కాబట్టి తెలంగాణకు పదవి రాలేదనే అంశాన్ని కేవలం పొరుగు రాష్ట్రంతో పోల్చడం కంటే, తెలంగాణకు ప్రస్తుతం పార్టీ ఏ రాజకీయ పాత్రను కేటాయించబోతోంది? అన్నదే కీలక ప్రశ్న. జాతీయ పదవి ఇవ్వకుండా రాష్ట్ర రాజకీయాల్లోనే పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తే అది ఒక వ్యూహం. తెలంగాణ నేతలకు జాతీయ స్థాయి ఎదుగుదలకు అవకాశం తగ్గిస్తే అది మరో సంకేతం. ఈ రెండింటి మధ్య తేడా రాబోయే నెలల్లోనే స్పష్టమవుతుంది. ముఖ్యంగా 2028 అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీకి తెలంగాణ సాధారణ రాష్ట్రం కాదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం, బీఆర్ఎస్ ప్రభావాన్ని తగ్గించడం, పట్టణ ఓటర్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో బలం పెంచడం వంటి అంశాల్లో రాష్ట్ర నాయకత్వం కీలకం. అందువల్ల జాతీయ టీమ్‌లో పదవి లేకపోయినా తెలంగాణ రాజకీయ వ్యూహంలో రాష్ట్ర నేతల పాత్ర తగ్గుతుందా? లేక మరింత పెరుగుతుందా? అన్నదే చూడాల్సిన విషయం.

### • బీజేపీ–బీఆర్ఎస్ కోణం మళ్లీ తెరపైకి

కొత్త జాతీయ టీమ్ నేపథ్యంలో తెలంగాణ రాజకీయాల్లో మరో చర్చ కూడా మొదలైంది. అది బీజేపీ, బీఆర్ఎస్ మధ్య భవిష్యత్ సమీకరణాలపై వస్తున్న ఊహాగానాలు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. బీజేపీ ప్రధాన ప్రతిపక్ష ప్రత్యామ్నాయంగా ఎదగాలని ప్రయత్నిస్తోంది. బీఆర్ఎస్ మాత్రం తన రాజకీయ పునరాగమనానికి ప్రయత్నిస్తోంది. ఈ మూడు పార్టీల మధ్య పోటీ 2028 ఎన్నికలకు ముందు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ జాతీయ టీమ్‌లో తెలంగాణకు ప్రాతినిధ్యం లేకపోవడాన్ని కొందరు రాజకీయ పరిశీలకులు రాష్ట్ర వ్యూహంలో మార్పుకు సంకేతంగా చూస్తున్నారు. అయితే బీజేపీ-బీఆర్ఎస్ మధ్య పొత్తు లేదా అవగాహనకు కొత్త జాతీయ టీమ్ కూర్పు ఆధారంగా ఎలాంటి నిర్ధారణ చేయడం ఇప్పుడే సాధ్యం కాదు. తెలంగాణలో బీజేపీ నాయకత్వం గతంలో బీఆర్ఎస్‌పై తీవ్ర రాజకీయ పోరాటం చేసింది. నితిన్ నబీన్ కూడా తెలంగాణ పర్యటనలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై రాజకీయ పోరాటానికి పిలుపునిచ్చారు. 2028లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని స్పష్టంగా ప్రకటించారు. కాబట్టి ప్రస్తుతానికి బీజేపీ అధికారిక వ్యూహం ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే అని చెప్పవచ్చు. అయితే ఎన్నికల రాజకీయాల్లో సమీకరణాలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. ఒకవైపు కాంగ్రెస్‌ను ఎదుర్కోవాలి. మరోవైపు బీఆర్ఎస్ ఓటు బ్యాంకును కూడా ఆకర్షించాలి. ఈ పరిస్థితిలో బీజేపీ తన తెలంగాణ వ్యూహాన్ని ఎలా అమలు చేస్తుందన్నది ఆసక్తికరం. జాతీయ టీమ్‌లో తెలంగాణకు చోటు లేకపోవడాన్ని కొందరు నాయకులు అసంతృప్తిగా చూడవచ్చు. మరికొందరు మాత్రం ఇది రాష్ట్ర నాయకులను జాతీయ పదవుల నుంచి దూరం పెట్టడం కాదు, తెలంగాణలోనే పూర్తి రాజకీయ బాధ్యతలు అప్పగించే వ్యూహంగా చూడవచ్చు. అందుకే బీజేపీ-బీఆర్ఎస్ భవిష్యత్ సంబంధాలపై వస్తున్న చర్చను ఇప్పటికైతే రాజకీయ ఊహాగానంగానే చూడాలి. స్పష్టమైన నిర్ణయం లేదా అధికారిక సంకేతం వచ్చే వరకు దానికి రాజకీయ అర్థం కట్టడం తొందరపాటు అవుతుంది.

### • అసలు పరీక్ష 2028 తెలంగాణే

చివరికి నితిన్ నబీన్ కొత్త జాతీయ టీమ్‌లో తెలంగాణకు ప్రాతినిధ్యం లేకపోవడం బీజేపీకి ఒక రాజకీయ ప్రశ్నను మాత్రం ముందుకు తెచ్చింది. తెలంగాణలో పార్టీ బలం పెరుగుతున్న సమయంలో జాతీయ స్థాయిలో ఒక్క పదవి కూడా ఎందుకు దక్కలేదు? అన్న ప్రశ్నకు రాష్ట్ర నాయకత్వం, జాతీయ నాయకత్వం ఎలా సమాధానం ఇస్తాయన్నది చూడాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న జాబితా ప్రకారం జాతీయ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కోశాధికారి, కార్యాలయ బాధ్యతలు, మీడియా, సోషల్ మీడియా, వివిధ మోర్చాల అధ్యక్ష పదవుల్లో తెలంగాణకు చెందిన నేతకు చోటు కనిపించలేదు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ నుంచి డి. పురందేశ్వరి జాతీయ ఉపాధ్యక్షురాలిగా, విష్ణువర్ధన్ రెడ్డి ఆల్ సెల్స్ జాయింట్ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఇది తెలంగాణ బీజేపీలో సహజంగానే చర్చకు దారితీయొచ్చు. అయితే రాజకీయంగా పెద్ద చిత్రం చూస్తే, నబీన్ తెలంగాణను గతంలో ప్రత్యేక మిషన్‌గా పేర్కొన్నారు. రాష్ట్రంలో సంస్థాగత విస్తరణపై దృష్టి పెట్టారు. 2028లో అధికారంలోకి రావడమే లక్ష్యమని ప్రకటించారు. అందువల్ల ప్రస్తుత పరిణామాన్ని తెలంగాణకు ప్రాధాన్యత పూర్తిగా తగ్గింది అని కాకుండా, జాతీయ పదవుల కేటాయింపులో తెలంగాణకు చోటు దక్కని పరిణామంగా చూడటం సముచితం. అసలు సంకేతం రాబోయే రోజుల్లో తెలుస్తుంది. తెలంగాణ నేతలకు కేంద్ర స్థాయిలో కొత్త బాధ్యతలు వస్తాయా? రాష్ట్రంలో కీలక ఎన్నికల బాధ్యతలు పెరుగుతాయా? 2028 వ్యూహంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం కొనసాగుతుందా? అన్నది కీలకం. బీజేపీ జాతీయ నాయకత్వం తెలంగాణను నిజంగా వ్యూహాత్మకంగా చూస్తే, ఆ ప్రాధాన్యత జాతీయ పదవులతో మాత్రమే కాదు, రాష్ట్ర రాజకీయాలపై తీసుకునే నిర్ణయాల్లో కూడా కనిపించాలి. జాతీయ టీమ్‌లో పదవి రాకపోవడం ఒక నిరాశ కావచ్చు. కానీ 2028 తెలంగాణ ఎన్నికల కోసం బీజేపీ వేసే ప్రతి అడుగే అసలు సమాధానం అవుతుంది. ప్రస్తుతం మాత్రం ఒక విషయం స్పష్టంగా ఉంది. తెలంగాణ బీజేపీకి కేంద్ర నాయకత్వం నుంచి జాతీయ పదవి దక్కలేదు. ఆ ఖాళీ ఎందుకు ఏర్పడింది అన్న ప్రశ్నకు సమాధానం కోసం ఇప్పుడు రాష్ట్ర నేతల చూపు ఢిల్లీ వైపే ఉంది.

## తెలంగాణకు ఢిల్లీ షాక్.. బీజేపీ వ్యూహం మారిందా?

జాతీయ టీమ్‌లో తెలంగాణకు చోటు లేదు. రాష్ట్రంలో బీజేపీ బలం పెరుగుతోందని చెబుతున్న వేళ.. ఢిల్లీలో తీసుకున్న నిర్ణయం ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో వేడి పుట్టిస్తోంది. ఎంపీలు ఉన్నారు.. ఎమ్మెల్యేలు ఉన్నారు.. సీనియర్ నేతలు ఉన్నారు.. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నామని పార్టీ చెబుతోంది. అయినా కొత్త జాతీయ టీమ్‌లో తెలంగాణ నేతకు కీలక పదవి ఎందుకు దక్కలేదు? ఇదే ఇప్పుడు అసలు ప్రశ్న. ఒకవైపు ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాలకు జాతీయ స్థాయిలో కీలక పదవులు దక్కాయి. మరోవైపు తెలంగాణ మాత్రం జాతీయ కూర్పులో ఖాళీగా కనిపించింది. ఇది సాధారణ సంస్థాగత నిర్ణయమేనా? లేక తెలంగాణపై బీజేపీ హైకమాండ్ వ్యూహంలో ఏదైనా మార్పు వచ్చిందా? రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయాలనుకుంటున్నామని నితిన్ నబీన్ ప్రకటించిన కొద్దికాలానికే వచ్చిన ఈ కూర్పు కొత్త అనుమానాలకు తావిస్తోంది. తెలంగాణకు పదవి దక్కకపోవడం కంటే.. ఎందుకు దక్కలేదన్నదే ఇప్పుడు హాట్ టాపిక్. 2028 అసెంబ్లీ ఎన్నికలను టార్గెట్ చేసిన బీజేపీ.. రాష్ట్ర నేతలను ఢిల్లీకి దూరంగా ఉంచి తెలంగాణలోనే పూర్తి బాధ్యతలు అప్పగించబోతోందా? లేక ఇది తెలంగాణ రాజకీయాలపై మారుతున్న హైకమాండ్ లెక్కలకు సంకేతమా? బీజేపీ-బీఆర్ఎస్ భవిష్యత్ సమీకరణాలపై ఇప్పటికే చర్చ నడుస్తున్న వేళ.. కొత్త జాతీయ టీమ్ కూర్పు ఆ చర్చకు మరింత మంట రాజేసింది. ఢిల్లీలో తీసుకున్న ఈ నిర్ణయం.. తెలంగాణలో ఎలాంటి రాజకీయ ప్రకంపనలు సృష్టించబోతోంది?




## ఇంకా చాలా ఉంది

### జాతీయ టీమ్‌లో తెలంగాణకు నిరాశ

నితిన్ నబీన్ ప్రకటించిన కొత్త బీజేపీ జాతీయ టీమ్‌లో తెలంగాణకు కీలక పదవి దక్కలేదు. రాష్ట్రంలో పార్టీ బలం పెరుగుతున్న సమయంలో ఈ పరిణామం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు ఉన్నా జాతీయ బాధ్యతల్లో తెలంగాణకు చోటు లేకపోవడం వెనుక కారణమేంటన్న ప్రశ్న ఇప్పుడు రాష్ట్ర నేతల్లో వినిపిస్తోంది.

### తెలంగాణ బలం ఉన్నా పదవి లేదు

తెలంగాణలో బీజేపీ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని ప్రయత్నిస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ బలమైన ఫలితాలు సాధించింది. అలాంటి రాష్ట్రానికి జాతీయ టీమ్‌లో ప్రాతినిధ్యం లేకపోవడం పార్టీ శ్రేణుల్లో అసంతృప్తికి కారణమయ్యే అవకాశం ఉంది. అయితే సంస్థాగత కూర్పు కేవలం ఎన్నికల బలం ఆధారంగా జరగదు.

### హైకమాండ్ వ్యూహంపై కొత్త చర్చ

తెలంగాణకు పదవి రాకపోవడాన్ని వెంటనే హైకమాండ్ రాష్ట్రాన్ని లైట్ తీసుకుందని తేల్చలేం. కొత్త టీమ్‌లో మహిళలు, మైనారిటీ వర్గాలకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించారు. అంటే జాతీయ కూర్పులో ప్రాంతీయ సమీకరణాలతో పాటు సామాజిక సమతుల్యతకు కూడా ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది.

### జేపీ–బీఆర్ఎస్ చర్చకు బ్రేక్ లేదు

జాతీయ టీమ్‌లో తెలంగాణకు ప్రాతినిధ్యం లేకపోవడంతో బీజేపీ-బీఆర్ఎస్ భవిష్యత్ సమీకరణాలపై కూడా ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే కొత్త టీమ్ కూర్పును ఆధారంగా చేసుకుని రెండు పార్టీల మధ్య పొత్తు లేదా అవగాహన ఉందని చెప్పడానికి ఎలాంటి అధికారిక ఆధారం లేదు. ప్రస్తుతం బీజేపీ తెలంగాణలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడంపైనే దృష్టి పెట్టింది.

### 2028 ఎన్నికలే అసలు పరీక్ష

జాతీయ పదవి దక్కకపోవడం కంటే తెలంగాణపై బీజేపీ హైకమాండ్ తీసుకునే తదుపరి నిర్ణయాలే కీలకం. 2028 అసెంబ్లీ ఎన్నికల కోసం రాష్ట్ర నేతలకు ఎలాంటి బాధ్యతలు ఇస్తారు, పార్టీ విస్తరణను ఎలా నడిపిస్తారు అన్నదే అసలు లెక్క. జాతీయ టీమ్‌లో కనిపించని తెలంగాణ ప్రాధాన్యత రాష్ట్ర ఎన్నికల వ్యూహంలో ఎంతవరకు కనిపిస్తుందో ఇప్పుడు చూడాలి.

# ఆదుర్రు.. చరిత్రకు విద్యాబాట

- బౌద్ధ చరిత్రకు నిఖార్సయిన వారసత్వం
- వందేళ్ల బడికి పూర్వవైభవం ఎప్పుడు?





బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఆదుర్రు గ్రామం వైనతేయ నదీ తీరాన సుమారు 2,400 ఏళ్ల నాటి బౌద్ధ చారిత్రక ఆధారాలకు నిలయంగా ఉంది. ఇక్ష్వాకు వంశానికి చెందిన సంఘమిత్ర నిర్మించిన బౌద్ధ స్థూపం ఈ ప్రాంత ప్రాచీన వైభవానికి నేటికీ సాక్ష్యంగా నిలుస్తోంది. ఇంతటి ఘన చరిత్ర ఉన్న ఆదుర్రు గ్రామంలోనే శతాబ్ద చరిత్ర కలిగిన ఎంపీపీఎస్ (ఎన్‌హెచ్‌ఎస్) పాఠశాల విద్యా వెలుగులు పంచింది. 1926 ఆగస్టు 17న గుర్తింపు పొందిన ఈ విద్యాలయం 2026 నాటికి వందేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. బ్రిటిష్ పాలన కాలంలోనే ప్రారంభమైన ఈ పాఠశాల ఎన్నో తరాల విద్యార్థులకు అక్షర జ్ఞానం అందించింది. ఒకవైపు 2,400 ఏళ్ల బౌద్ధ చరిత్ర.. మరోవైపు వందేళ్ల విద్యా చరిత్ర.. ఆదుర్రుకు ఈ రెండు వారసత్వాలు ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి.

### దాతల సేవతో నిలిచిన విద్యాలయం

1926లో కవికొండ మాచయ్యగారు పాఠశాల స్థాపనకు శ్రీకారం చుట్టగా.. ఇరుకు రెడ్డయ్యగారు అభివృద్ధికి కృషి చేశారు. అనంతరం నూకల రామకృష్ణుడు, ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్యం, నూకల సూర్యభాస్కరం, కామేశ్వరరావు వంటి దాతలు విద్యాలయ అభివృద్ధికి అండగా నిలిచారు. మూడు కుంచాల భూమిని దానం చేసి పాఠశాల నిర్మాణానికి బాటలు వేసిన సేవలు ఈ విద్యాలయ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాయి. కాలం మారినా దాతల సేవా స్ఫూర్తి కొనసాగింది. ఇటీవల డాక్టర్ ఉపాధ్యాయుల లక్ష్మీనరసింహం చైనులు, అన్నపూర్ణ దంపతులు సుమారు రూ.50 లక్షల వ్యయంతో ఆధునిక పాఠశాల భవనాన్ని నిర్మించారు. విశాలమైన తరగతి గదులు, పెద్ద డైనింగ్ హాల్, సౌకర్యవంతమైన మరుగుదొడ్లు, ఆటస్థలం వంటి మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయి. సుమారు 1,452 చదరపు గజాల విశాలమైన ప్రాంగణం కూడా పాఠశాలకు ఉంది. వసతుల విషయంలో వెనుకబడని ఈ విద్యాలయం.. విద్యార్థుల సంఖ్య విషయంలో మాత్రం వెనుకబడిపోయింది. ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన పాఠశాల ఇప్పుడు కేవలం 10 మంది విద్యార్థులతో కొనసాగుతోంది. 3, 4, 5 తరగతులను సమీప హైస్కూల్‌లో విలీనం చేయడంతో పాఠశాల 1, 2 తరగతులకే పరిమితమైంది. దీంతో విశాలమైన భవనం, ఆటస్థలం, డైనింగ్ హాల్ వంటి సౌకర్యాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మేధావులను తీర్చిదిద్దిన బడి

ఈ పాఠశాల గొప్పతనానికి ఇక్కడ చదువుకున్న విద్యార్థుల ప్రస్థానమే ప్రత్యక్ష నిదర్శనం. నూకల కామేశ్వరరావుగారు ఇదే పాఠశాలలో చదివి.. తర్వాత ఇదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందించారు. అలాగే ఇక్కడ చదువుకున్న ఉపాధ్యాయుల సూర్యనారాయణమూర్తిగారు ప్రస్తుతం గౌహతిలోని నైపర్‌లో డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇలా ఎందరో విద్యావేత్తలు, మేధావులు, వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరిన వ్యక్తులను ఈ విద్యాలయం సమాజానికి అందించింది. అందుకే ఈ పాఠశాల కేవలం ఓ భవనం కాదు.. ఎన్నో తరాల భవిష్యత్తుకు పునాది వేసిన విద్యా వారసత్వం.




వందేళ్ల చరిత్ర ఉన్న పాఠశాల ఇప్పుడు పదిమంది విద్యార్థులకే పరిమితం కావడం బాధాకరమని పూర్వ విద్యార్థులు చెబుతున్నారు. పాఠశాలను మళ్లీ 1 నుంచి 5వ తరగతి వరకు పునరుద్ధరించాలని గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు కోరుతున్నారు. అవసరమైన ఉపాధ్యాయులను కేటాయించి, స్థానికంగానే నాణ్యమైన ప్రాథమిక విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా అభివృద్ధి చేస్తే చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు చేరే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. అలా చేస్తే ప్రస్తుత మౌలిక వసతులు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడంతో పాటు పాఠశాలకు పూర్వవైభవం కూడా తిరిగి వస్తుందని అంటున్నారు.

### చరిత్ర.. విద్య.. పర్యాటకానికి కొత్త దారి

ఆదుర్రు ప్రత్యేకత పాఠశాలతో మాత్రమే ఆగిపోదు. వైనతేయ నది తీరాన ఉన్న ప్రాచీన బౌద్ధ స్థూపం ఈ ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యాన్ని తీసుకొచ్చింది. మరోవైపు వందేళ్లు పూర్తి చేసుకున్న పాఠశాల విద్యా వారసత్వానికి ప్రతీకగా నిలిచింది. ఈ రెండు అంశాలను అనుసంధానం చేస్తే ఆదుర్రును విద్య, చరిత్ర, పర్యాటక ప్రాధాన్యమున్న ప్రత్యేక కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశం ఉందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. చారిత్రక స్థల పరిరక్షణతో పాటు పాఠశాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తే గ్రామానికి కొత్త గుర్తింపు వస్తుందని చెబుతున్నారు. 2,400 ఏళ్ల బౌద్ధ వారసత్వాన్ని కాపాడుతూ.. 100 ఏళ్ల విద్యా వారసత్వాన్ని నిలబెట్టడం ఆదుర్రు భవిష్యత్తుకు కీలకమని స్థానికులు భావిస్తున్నారు. శతాబ్ది ఉత్సవాలు నిర్వహించడం మాత్రమే కాకుండా పాఠశాల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి 1 నుంచి 5వ తరగతి వరకు పునరుద్ధరించడంతో పాటు మోడల్ ప్రైమరీ స్కూల్‌గా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన బడి.. పదిమంది పిల్లల దగ్గర ఆగిపోకూడదన్నదే గ్రామస్థుల ఆకాంక్ష. ఒకప్పుడు పిల్లల అడుగులతో సందడిగా ఉన్న ఈ విద్యాలయం మళ్లీ విద్యార్థుల కేరింతలతో మార్మోగాలి. వైనతేయ తీరంలో వెలిగిన చరిత్రకు.. ఆదుర్రు బడి విద్యాదీపంగా కొనసాగాలి. శతాబ్దం చూసిన ఈ విద్యాలయం మరో శతాబ్దం కూడా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు వెలుగుబాట వేయాలి.









## దివ్యాంగ విద్యార్థులకు కిరాణా సంఘం అండ

జగ్గంపేట మండలం భవిత ప్రత్యేక పాఠశాలలోని దివ్యాంగ విద్యార్థులకు జగ్గంపేట కిరాణా వర్తక సంఘం అండగా నిలిచింది. 20 మంది విద్యార్థులకు యాపిల్స్, బిస్కెట్లు పంపిణీ చేయడంతో పాటు విద్యా, వైద్య, దివ్యాంగ ధ్రువపత్రాలను భద్రపరచుకునేందుకు సర్టిఫికెట్ ఫైల్ ఫోల్డర్లను విరాళంగా అందించారు. పాఠశాల ఉపాధ్యాయులు అప్పాన పెద్దకాపు, తిత్తి చిన్నబాబు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలో 100 మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నారని, అందరికీ ఫైల్ ఫోల్డర్లు అవసరమని చెప్పారు. తరగతి గదులకు కుర్చీలు, ఫ్యాన్లు అవసరమని, విద్యార్థులు భోజనం చేసే వరండాలో కోతుల బెడద నివారించేందుకు ఐరన్ మెష్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అవసరాలను తీర్చేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, కిరాణా వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.




## డీఎస్సీపై అసత్య ప్రచారం


### ఎమ్మెల్యే జ్యోతులను కలిసిన అభ్యర్థులు

జగ్గంపేటలో డీఎస్సీ అభ్యర్థుల సంఘీభావ సమావేశం నిర్వహించారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని అభ్యర్థులు ఖండించారు. రాజకీయ ప్రయోజనాల కోసం లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం సరికాదని, ప్రభుత్వం పారదర్శకంగా చేపడుతున్న నియామక ప్రక్రియకు తమ మద్దతు ఉందని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్లు ఆలస్యం కావడంతో పలువురు వయోపరిమితి దాటిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 16,500 డీఎస్సీ పోస్టులకు అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత నియామకాలను వేగంగా పూర్తి చేసి, తదుపరి డీఎస్సీ నోటిఫికేషన్‌ను త్వరగా విడుదల చేయాలని కోరారు. వయోపరిమితి దాటిన అభ్యర్థులకు ఉపాధి కల్పించేలా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వారి సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి, అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హామీ ఇచ్చారు.



## అడ్డకొండ భూములపై పోరుబాట

కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లిసాల, గోపాలపురం గ్రామాలకు చెందిన దళిత, గిరిజన, బీసీ, ఇతర నిరుపేదలకు అడ్డకొండ భూములపై తక్షణమే పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. మూడు దశాబ్దాలుగా భూముల కోసం పోరాడుతున్న పేదల సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. సోమవారం జగ్గంపేట ప్రధాన రోడ్డులో నిరసన ర్యాలీ నిర్వహించారు. గతంలో భూములను చదును చేసి మామిడి, జీడిమామిడి సాగు చేస్తూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. భూస్వాములకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు వచ్చినా పట్టాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అడ్డకొండ భూములను పేదలకు పంచకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి

ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో కాకినాడ జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరింత అప్పలరాజు, ప్రైవేట్ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి వల్లూరి సత్యానందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వివిధ ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేసేలా పార్లమెంట్ ద్వారా ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. కార్మికులు, కర్షకులకు కనీస వేతనం అమలు చేయాలని, పాఠశాలలు, ఆసుపత్రులు, పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ, స్టీల్ ప్లాంట్, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికుల సేవలను ప్రైవేటీకరించకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు ఎస్.కె. జానీ, దళిత నాయకులు సూరిబాబు, జి. సుధాకర్ పాల్గొన్నారు.

## జీవో 97ను వెనక్కి తీసుకోవాలి



తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'తో పాటు ఐటీఐ, ఏటీసీలతో అనుసంధానిస్తూ డిప్లొమా కోర్సులను నిర్వహించే విధానం వల్ల ప్రభుత్వ సాంకేతిక విద్యపై ప్రభావం పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం షాద్‌నగర్‌లో పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి ఆర్డీవో, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. దశాబ్దాలుగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన సాంకేతిక విద్య అందిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ వ్యవస్థను పీపీపీ విధానంలోకి తీసుకెళ్లడం సరికాదన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు, ల్యాబ్‌ల ఆధునీకరణ, అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని కోరారు. విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించేందుకు జీవో 97లోని పూర్తి వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితాలో తప్పులుంటే సరిచేసుకోండి



షాద్‌నగర్ మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ రాజు నాయక్ ఆధ్వర్యంలో సర్ ప్రక్రియ అనంతరం 6వ వార్డుకు సంబంధించిన బూత్‌వారీ ముసాయిదా ఓటర్ జాబితాను సోమవారం టీచర్స్ కాలనీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి అర్హత కలిగిన పౌరుడి నైతిక బాధ్యత అని అన్నారు. ప్రజలు తమ పేరు, చిరునామా, వయసు తదితర వివరాలు జాబితాలో సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ముసాయిదా జాబితాలో తప్పులు, అభ్యంతరాలు, పేర్ల మార్పులు ఉంటే నిర్ణీత గడువులోగా సంబంధిత బీఎల్ఓలు, ఎన్నికల అధికారులను సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడు ఓటు వేసే ముందు ఓటర్ జాబితాలో తన పేరు ఉందో లేదో తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎల్ఓలు , స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



## గరుడ పంచమికి ప్రత్యేక పూజలు

షాద్‌నగర్ ఫరూఖ్‌నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో గరుడ పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరుడ పంచమి హిందూ సంప్రదాయంలో విశిష్టమైన పర్వదినమని అన్నారు. శ్రీ మహావిష్ణువుకు పరమ భక్తుడైన గరుత్మంతుడిని పూజించే ఈ రోజున భక్తులు స్వామివారిని, గరుడ దేవుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారని తెలిపారు. కుటుంబ సభ్యులకు ఆరోగ్యం, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆధ్యాత్మికతతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అర్చకులు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## చదువులో ప్రతిభ

### విద్యార్థులకు ఘన సత్కారం

- విద్యాభిమానుల అభినందనల పండుగ
- 500 మార్కులు దాటిన విద్యార్థులకు గౌరవం



రాయవరం గ్రామంలోని శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. పాఠశాలలో చదివి 500కు పైగా మార్కులు సాధించిన 39 మంది విద్యార్థినీ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. రాయవరం గ్రామానికి చెందిన విద్యార్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి చదువుకున్న ప్రతిభావంతులు కూడా ఈ సత్కారాన్ని అందుకున్నారు.

### విద్యార్థులు.. తల్లిదండ్రులకు ఘన సన్మానం

రాయవరం మాజీ సర్పంచ్ పాలింగి చిన్నబాబు, యువ నాయకుడు బక్కీ సందీప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా డాక్టర్ జి.ఎస్.ఎన్. రెడ్డి, పారిశ్రామికవేత్త తేతలి సుబ్బిరామిరెడ్డి, డాక్టర్ టీ. నవీన్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించి, ప్రతిభను అభినందించారు. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.

### పార్టీలకు అతీతంగా నేతల హాజరు

ఈ కార్యక్రమానికి ఎంపీపీ నౌడు వెంకటరమణ, టీడీపీ నేతలు తమలంపూడి గంగాధరరెడ్డి, కోటరెడ్డి, వైఎస్సార్సీపీ నేతలు అచ్చుతరామరాజు, పడాల కమలారెడ్డి, పులగం శ్రీనివాస్‌రెడ్డి, తాడి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. యోగ మాస్టర్ వెలగల ఫణికృష్ణారెడ్డి, సాయితేజ స్కూల్ అధినేత కర్రీ సందీప్‌రెడ్డి, విజ్ఞాన్ కాలేజీ డైరెక్టర్ అమ్మిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు పోలిమాటి సుధాకర్, బీజేపీ నేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, దళిత నాయకులు గొట్టి సూరిబాబు, కచ్చా రాజశేఖర్, నేతల చంద్రశేఖర్ (చంటి), గండి చంద్రశేఖర్ తదితరులు హాజరై విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మంది యువత ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు.



# బాబర్ గాయం పాకిస్థాన్‌కు షాక్

## ఇంగ్లండ్ టెస్టుకు ముందు కెప్టెన్ దూరం

ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు పాకిస్థాన్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. జట్టు కెప్టెన్ బాబర్ ఆజమ్ చేతి గాయంతో తొలి టెస్టుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. లీడ్స్ వేదికగా బుధవారం నుంచి ప్రారంభం కానున్న తొలి టెస్టులో బాబర్ అందుబాటులో ఉండకపోవచ్చని సమాచారం. దీంతో పాకిస్థాన్ జట్టుకు కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేయాల్సిన పరిస్థితి వచ్చింది.
శనివారం ప్రొఫెషనల్ కౌంటీ క్లబ్ సెలెక్ట్ ఎలెవన్‌తో జరిగిన టూర్ మ్యాచ్‌లో బాబర్ కుడి చేతికి పేసర్ మ్యానీ లమ్స్‌డెన్ వేసిన బంతి బలంగా తగిలింది. దీంతో కేవలం ఐదు పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. ముందుజాగ్రత్త చర్యగానే అతను బ్యాటింగ్ నుంచి తప్పుకున్నప్పటికీ, గాయం తీవ్రతపై అనుమానాలు కొనసాగుతున్నాయి.
బాబర్ ఇప్పటివరకు త్రో డౌన్స్‌తో మాత్రమే స్వల్పంగా బ్యాటింగ్ చేశాడు. నెట్స్‌లో పూర్తిస్థాయిలో బ్యాటింగ్ చేయలేదని సమాచారం. తొలి టెస్టుకు అతను అందుబాటులో ఉంటాడా లేదా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. కీలక సిరీస్‌కు ముందు కెప్టెన్ దూరమయ్యే పరిస్థితి పాకిస్థాన్‌కు పెద్ద సమస్యగా మారింది.

# జడేజా 350 వికెట్ల మైలురాయి



- శ్రీలంకపై భారత్ దూకుడు
- 178 పరుగుల ఆధిక్యం
- శ్రీలంక 284 పరుగులకు ఆలౌట్

గాలే వేదికగా భారత్-శ్రీలంక తొలి టెస్టు మూడో రోజు భారత బౌలర్లు సత్తా చాటారు. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకు ఆలౌటైంది. దీంతో భారత్‌కు 178 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఒక దశలో 90/5తో శ్రీలంక తీవ్ర ఇబ్బందుల్లో పడింది. శ్రీలంకను నీరోషన్ డిక్వెల్లా, సోనల్ దినుషా ఆదుకున్నారు. ఇద్దరూ కలిసి 146 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. డిక్వెల్లా 80 పరుగులు చేసి వెనుదిరగగా, దినుషా అద్భుతంగా బ్యాటింగ్ చేసి తన తొలి టెస్టు శతకాన్ని నమోదు చేశాడు. ఈ భాగస్వామ్యంతో శ్రీలంక భారీ లోటును తప్పించుకుంది.
భారత్ బౌలింగ్‌లో మానవ్ సుథార్ నాలుగు వికెట్లు పడగొట్టి కీలక పాత్ర పోషించాడు. రవీంద్ర జడేజా మూడు వికెట్లు తీసి శ్రీలంక ఇన్నింగ్స్‌ను కట్టడి చేశాడు. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు ఆలౌటైంది.
ఈ మ్యాచ్‌లో జడేజా మరో చారిత్రక మైలురాయిని అందుకున్నాడు. టెస్టు చరిత్రలో 4,000 పరుగులు, 350 వికెట్లు సాధించిన నాలుగో ఆటగాడిగా నిలిచాడు. మూడో రోజు ముగిసే సమయానికి భారత్ 178 పరుగుల ఆధిక్యంలో ఉండటంతో మ్యాచ్‌పై పట్టు బిగించింది. నాలుగో రోజు బ్యాటింగ్‌లో భారత్ ఎంత దూకుడు చూపుతుందన్నది కీలకం కానుంది.

## నంబర్ 9లో బ్యాటింగ్.

**• జడేజా అసంతృప్తి • యువ జట్టులో అనుభవజ్ఞుడు**

భారత టెస్టు జట్టు ప్రస్తుతం యువ ఆటగాళ్లతో కళకళలాడుతోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వయసు 26 ఏళ్లు కాగా, జట్టులోని చాలామంది ఆటగాళ్లు 30 ఏళ్లలోపే ఉన్నారు. ఈ తరంలో 37 ఏళ్ల రవీంద్ర జడేజా మాత్రం ప్రత్యేకంగా కనిపిస్తున్నాడు. కోహ్లీ, రోహిత్, అశ్విన్ శకానికి కొనసాగింపుగా ఉన్న కీలక ఆటగాడిగా జడేజా నిలిచాడు. 89 టెస్టుల్లో జడేజా 348 వికెట్లు, 4,095 పరుగులు సాధించాడు. అయితే బ్యాటింగ్‌లో తాను మరింత మెరుగ్గా రాణించాల్సిందని భావిస్తున్నాడు. ముఖ్యంగా దిగువ స్థానంలో బ్యాటింగ్ చేయడం తన సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోలేకపోయిందని చెప్పాడు. దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో తన బ్యాటింగ్ సగటు 60కుపైగా ఉందని గుర్తుచేశాడు. రంజీ ట్రోఫీలో మూడు ట్రిపుల్ సెంచరీలు, 250కుపైగా రెండు స్కోర్లు సాధించిన విషయాన్ని జడేజా ప్రస్తావించాడు. నంబర్ 8, 9లో బ్యాటింగ్‌కు వెళ్లే సమయానికి పరిస్థితులు టీ20 లేదా వన్డేలా మారిపోతాయని అన్నాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో ప్యాడ్లు కట్టుకుని తన వంతు కోసం ఎదురుచూస్తూ, పక్కనే పేసర్ బ్యాటింగ్‌కు సిద్ధమవుతున్న దృశ్యాలు ఆత్మవిశ్వాసాన్ని తగ్గించేవని తెలిపాడు. తాను పైస్థానంలో బ్యాటింగ్ చేసి ఉంటే మరింత ప్రభావం చూపగలిగేవాడినన్న నమ్మకాన్ని జడేజా వ్యక్తం చేశాడు.

### గాలే టెస్టులో జడేజా చారిత్రక ఘనత

శ్రీలంకతో గాలే వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అరుదైన ఘనత సాధించాడు. టెస్టు క్రికెట్‌లో 350 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. 37 ఏళ్ల జడేజా ఈ ఘనత సాధించిన ఐదో భారత బౌలర్‌గా నిలిచాడు. భారత్ తరఫున అనిల్ కుంబ్లే 619, రవిచంద్రన్ అశ్విన్ 537, కపిల్ దేవ్ 434, హర్భజన్ సింగ్ 417 వికెట్లతో జడేజా కంటే ముందున్నారు. ఎడమచేతి వాటం స్పిన్నర్లలోనూ జడేజా ఇప్పుడు మూడో స్థానానికి చేరాడు. శ్రీలంక దిగ్గజం రంగనా హెరాత్ 433 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా, న్యూజిలాండ్ మాజీ ఆల్‌రౌండర్ డేనియల్ వెట్టోరి 362 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. శ్రీలంక బ్యాటర్ కేశర నువాంతా జడేజా వేసిన బంతిని దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించగా, షాట్ సరిగ్గా కనెక్ట్ కాలేదు. బంతి గాల్లోకి లేవడంతో శుభ్‌మన్ గిల్ క్యాచ్ అందుకున్నాడు. దీంతో జడేజా తన 350వ టెస్టు వికెట్‌ను ఖాతాలో వేసుకుని భారత క్రికెట్‌లో మరో చరిత్ర సృష్టించాడు.

# చిరంజీవి పాత్రను ఎలివేట్ చేసేలా ..

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ మూవీకి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు మెగా అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. భారీ యాక్షన్ షెడ్యూల్‌లో భాగంగా కీలకమైన పోరాట సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ రామ్,లక్ష్మణ్ మాస్టర్స్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ఫైటర్లతో ఈ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. సినిమాలో యాక్షన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉండటంతో ఈ సన్నివేశాలను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి అభిమానులను ఆకట్టుకునేలా యాక్షన్ ఎపిసోడ్స్‌ను డిజైన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమా నుంచి మరో క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న యాక్షన్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత వచ్చే వారం నుంచి స్పెషల్ సాంగ్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ పాటలో చిరంజీవి పూర్తిగా స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారట. ఈ స్పెషల్ సాంగ్ కోసం మెగాస్టార్ లుక్‌ను ఇప్పటికే లాక్ చేసినట్లు సమాచారం. చిరంజీవి ఎనర్జీకి తగ్గట్టుగా పాటను డిజైన్ చేస్తున్నారని, తెరపై ఆయన స్టైలిష్ అవతార్ అభిమానులను మెస్మరైజ్ చేయడం ఖాయమని చిత్ర వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో చిరంజీవి పాత్రను దర్శకుడు బాబీ చాలా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. మెగాస్టార్ పాత్రలో పలు రకాల వేరియేషన్స్ ఉంటాయని సమాచారం. ఇప్పటివరకు చిరంజీవిని చూడని ఓ కొత్త కోణంలో ప్రేక్షకులకు చూపించాలనే ఉద్దేశంతో బాబీ ఈ కథను సిద్ధం చేసినట్లు టాక్. అదే సమయంలో సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కూడా పెద్దపీట వేస్తున్నట్లు తెలుస్తోంది. యాక్షన్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామాతో పాటు చిరంజీవి స్టైల్, కామెడీ, మాస్ ఎలిమెంట్స్‌ను మేళవించి కథను రూపొందిస్తున్నట్లు సమాచారం.








# డిసి ఆద్యంతం అద్భుతంగా ఉంది

## నటుడు మహేశ్ బాబు రివ్యూ

లోకేశ్ కనగరాజ్, వామికా గబ్బి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'డీసీ' ఇటీవల విడుదలైన ప్రశంసలు అందుకుంటోంది. తాజాగా స్టార్ హీరో మహేశ్ బాబు 'డీసీ' చిత్రానికి శుభాకాంక్షలు తెలిపారు. ఎక్స్ వేదికగా తన రివ్యూ ఇచ్చారు. చాలా వినూత్నమైన, అద్భుతమైన చిత్రం. చాలా బాగుంది. ప్రతి అంశం నచ్చింది. ఈ సినిమా కోసం వర్క్ చేసిన వారందరికీ అభినందనలని పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్‌ను దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ రీషేర్ చేస్తూ మహేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 'మీ పోస్ట్ నిజంగా చాలా సంతోషాన్నిచ్చింది. మీరు డీసీని చూడటం, దీన్ని అభినందించడం చాలా ప్రత్యేకంగా అనిపిస్తోంది. మీ ప్రేమకు, కామెంట్స్‌కు ధన్యవాదాలు' అని రిప్లై ఇచ్చారు. దర్శకుడిగా తనదైన ముద్రవేసిన లోకేశ్ కనగరాజ్‌లో నటుడు కూడా ఉన్నారు. పలు చిత్రాల్లో ఆయన తళుక్కున మెరిశారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రమే 'డీసీ'. ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. 'డీసీ' చూశాను. సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని తప్పకుండా చూడాలి. చిత్రబృందానికి అభినందనలు. దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ చాలా గొప్పగా తీశారు. అనిరుధ్ నిజంగా అద్భుతం చేశారు. లోకేశ్ కనగరాజ్ హీరో పాత్రలో ఒదిగిపోయారని అల్లు అర్జున్ ప్రశంసించారు.



## పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తున్న విశ్వనాథ్ అండ్ సన్స్

సూర్య హీరోగా నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' తెలంగాణ బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా.. తొలి వీకెండ్‌లోనూ అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా నైజాం ఏరియాలో ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. వీకెండ్‌లో భాగంగా ఆదివారం మూడో రోజు నైజాం ప్రాంతంలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' రూ.5.2 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. దీంతో తొలి మూడు రోజుల్లో నైజాంలో ఈ సినిమా మొత్తం రూ.14 కోట్ల గ్రాస్ మార్కును అందుకుంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ స్థాయి వసూళ్లు రావడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా ఈ చిత్రానికి అత్యుత్తమంగా స్పందించిన ప్రాంతంగా నైజాం నిలిచినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వీకెండ్‌లో భారీ వసూళ్లు సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. సోమవారం నాటికి జీఎస్టీ మినహాయించి బ్రేక్ ఈవెన్ టార్గెట్‌ను అందుకునే అవకాశం ఉందని సమాచారం. ఇదే జోరు వర్కింగ్ డేస్‌లోనూ కొనసాగితే నైజాం డిస్ట్రిబ్యూటర్లకు మంచి లాభాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథ, సూర్య నటన, వెంకీ అట్లూరి దర్శకత్వం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తున్నాయి.

# అందుకే రావణుడి పాత్ర బలంగా ఉండాలి: యశ్



కన్నడ స్టార్ యశ్ ప్రస్తుతం 'టాక్సిక్', 'రామాయణ' చిత్రాలతో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'రామాయణ' గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. రావణుడి పాత్రకి ఎందుకు ఓకే చెప్పారో వెల్లడించగా.. ఆ సమాధానం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. రాముడి మంచితనాన్ని, సుగుణాలను చూపించాలంటే రావణుడి పాత్రలో బాగా నటించాలి. నేను విలన్ పాత్రలకు న్యాయం చేయగలను. మంచి పాత్రలు చేసినా నావంతు ప్రయత్నం తప్పకుండా చేస్తాను. 'రామాయణ' కోసం మేమంతా ఇగోని పక్కన పెట్టాం. బెస్ట్ టీమ్‌తో కలిసి పనిచేస్తున్నాం. రామాయణం గురించి ప్రతి ఒక్కరికీ తెలిసే ఉంటుంది. నేను చిన్నప్పుడు మా తాత చెబితే ఒకలాగా ఊహించుకునే వాడిని. టీవీలో, సినిమాల్లో చూసిన తర్వాత ఆ ఊహ మారింది. అందరికీ తెలిసిన కథైనప్పటికీ దాన్ని కొత్తగా చూపించగలగాలి. అలా అని మతపరమైన భావాలను దెబ్బతీయకూడదు. ఇది చాలా కష్టమైన పని. నా స్నేహితుడు నమిత్ మల్హోత్రా ఈ సినిమా కోసం బాగా రిస్క్ తీసుకుంటున్నారు. ప్రేక్షకులు దీన్ని ఆదరిస్తారని నమ్ముతున్నానని యశ్ పేర్కొన్నారు. నితీశ్ తివారి దర్శకత్వంలో ముస్తాబైన ఈ బహుభాషా చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించగా.. సీత పాత్రను సాయిపల్లవి పోషించారు. యశ్ ఇందులో రావణుడి పాత్ర పోషిస్తూనే నమిత్ మల్హోత్రాతో కలిసి నిర్మించారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. 'రామాయణ: పార్ట్ 1' ఈ దీపావళికి విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఇటీవల ట్రైలర్‌ని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇక, యశ్ మరో సినిమా 'టాక్సిక'.. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ మూవీలో కియారా అద్వాణీ, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.